గురు వారం
02-11-2023
సంపుటి - 08,
సంచిక - 377
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## తెలంగాణ కోసం పుట్టిందే బిఆర్ఎస్ పార్టీ

### బిజెపి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమం గురించి మాట్లాడే దమ్ముందా



- తెలంగాణలో ఎక్కడ చూసినా వడ్ల కల్లాలే
- లక్ష్మీ అమ్మవారు తాండవం చేసినట్లు ఉంది
- కరెంట్, రైతుబంధుతో రైతుల కళ్లల్లో ఆనందం
- కర్నాటక గురించి గొప్పలు చెబుతున్న సన్నాసులు
- మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఇల్లందు సభలు సిఎం కెసిఆర్ పిలుపు
- దళితబంధు కోసం దరఖాస్తు పెట్టారా ఏమైనా?
- దేశంలో ఎక్కడైనా దళితబంధు ఇస్తున్నారా?
- దళితుల సంక్షేమం కోసమే దళితబంధు
- ప్రజా ఆశీర్వాద సభలో సిఎం కెసిఆర్
- మన తలరాతను మార్చేది ఓటు
- మంచి వ్యక్తిని చూసి ఓటేయాలి
- ప్రలోభాలకు లొంగితే నష్టపోయేది మనమే
- బిఆర్ఎస్ మాత్రమే ప్రజలకు మంచి చేసేది
- నిరంతర కరెంట్ ఇస్తున్నది కూడా తెలంగాణలోనే
- ఇల్లందు సభలో సిఎం కెసిఆర్ పిలుపు

**ఖమ్మం, నవంబర్ 1 (సమ సమాజం):** కర్నాటకలో కరెంట్ సరఫరా చూస్తే రైతులు గొల్లుమంటున్నారని, అయితే అక్కడ ఐదుగంటల కరెంట్ ఇస్తున్నామని కర్నాటక ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి కెసిఆర్ ధ్వజమెత్తారు. వ్యవయాసానికి ఐదుగంటలు కరెంటు ఇస్తున్నామని చెప్పడంపై ఇల్లందు సభ నుంచి కౌంటర్ ఇచ్చారు. భగవంతుడి దయతో పదేళ్ల నుంచి వర్షాలు పడుతున్నయ్. కరెంటు మంచిగున్నది. మంచినీళ్ల పీడపోయింది. ఎక్కడ చూసినా మంచి పంటలు పండుతున్నయ్. ఎక్కడ చూసినా వడ్ల కళ్లాలు. లక్ష్మీ అమ్మవారు నాట్యం చేసినట్టున్నది. అప్పుడప్పుడు హెలీకాప్టర్‌లో పోయిన చూసిన సందర్భంలో రోడ్లపై వడ్లు ఎండపోసి కనబడుతున్నయ్. మనసుకు సంతోషమవుతున్నది. మూడుకోట్ల టన్నుల వరిధాన్యం పండితున్నది నా తెలంగాణ. ఒకనాడు గొడగొడ ఏడ్చిన తెలంగాణ.. అన్నమో రామచంద్ర అని తండ్లాడిన తెలంగాణ. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే నాలుగుకోట్ల టన్నుల ధాన్యం పండుతుంది తెలంగాణలో. లక్ష్మీదేవి కటాక్షం ఇంత ఉన్న తెలంగాణలో.. 93లక్షల రేషన్‌కార్డులున్నయ్. కార్డుదారులందరికీ వచ్చే మార్చి నుంచి సన్నబియ్యమే ఇస్తాం' అని చెప్పారు. 'ఉత్తమ్ కుమార్‌రెడ్డి రైతుబంధు ఇచ్చి పన్నుల డబ్బులు రైతులకు ఇచ్చి దుబారా చేస్తున్నడు అని మాట్లాడుతున్నడు. కరెంటు

5వ పేజీలో...

## కెసిఆర్‌ను గద్దె దించాలంటే కలసికట్టు పోరాటం



- అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే
- వివేక వెంకటస్వామి చేరికతలో వెయ్యేనుగుల బలం
- పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి వ్యాఖ్య

**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌ను గద్దె దించాలంటే అంతా కలిసికట్టుగా పనిచేయాలని పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అవినీతి, కుటుంబ పాలనకు తెలంగాణలో తెరదించాలని అన్నారు. ఇది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. బిజెపిని వీడి కాంగ్రెస్‌లో చేరిన వివేక్ వెంకటస్వామిని కూడా ఇదే కోరడం జరిగిందని అన్నారు. గాంధీ కుటుంబంతో వివేక్‌కు ఎంతో అనుబంధం ఉందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన నోవోటెల్ హోటల్ వద్ద మీడియాతో మాట్లాడుతూ వివేక్‌తో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ) ఫోన్‌లో మాట్లాడి కాంగ్రెస్‌లో చేరాలని కోరారని, ఆయన కోరిక మేరకు రాహుల్ సమక్షంలో పార్టీలో చేరారన్నారు. వివేక్ తిరిగి కాంగ్రెస్‌లో చేరడమంటే

5వ పేజీలో...

## తెలంగాణను అప్పులకుప్పగా మార్చిన కెసిఆర్

- బిజెపిలో చేరిన బోథ్ ఎమ్మెల్యే బాపూరావు
- అధికార పార్టీపై వ్యతిరేకత ఉందన్న కిషన్ రెడ్డి
- 3నుంచి ప్రచారం ఉధృతం చేస్తామని ప్రకటన



**న్యూఢిల్లీ, నవంబర్ 1 (సమ సమాజం):** కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఆయనను సాదరంగా బీజేపీలోకి స్వాగతిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో

5వ పేజీలో...

## బిఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం : మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** ఎల్బీనగర్‌లో మంత్రి హరీష్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నేత ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, ప్రసన్న లక్ష్మి దంపతులు, ఇతర నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. రామ్మోహన్ గౌడ్ ఉద్యమకారుడని..

5వ పేజీలో...

## బీజేపీకి బిగ్ షాక్..

### రాహుల్ సమక్షంలో కాంగ్రెస్ లోకి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** ఎన్నికల సమయంలో తెలంగాణ బీజేపీకి భారీ షాక్ తగిలింది. పెద్దపల్లి మాజీ ఎంపీ, తెలంగాణ బీజేపీ సీనియర్ నేత, ఆ పార్టీ మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మన్ వివేక్ వెంకటస్వామి కమలం పార్టీకి గుడ్‌బై చెప్పారు. కేవలం రెండు వాక్యాలతో ఆయన తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు.


## నాణెళిలతె వెళ్లాడు.. నామినేషను తిరస్కరించారు



**రాయ్‌పూర్, నవంబర్ 1 (సమ సమాజం):** ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషను దాఖలుకు వెళ్లిన ఓ వ్యక్తికి చేదు అనుభవం ఎదురైంది. అఖిల భారత ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు గణెళిశ్‌దాస్ మహంత్ కోర్బా స్థానం నుంచి పోటీ చేయాలని భావించారు. ఈ మేరకు తుల్సీనగర్ బస్తీలోని ఎన్నికల కార్యాలయానికి నామినేషను దాఖలుకు వెళ్లి, ధరావతు రుసుం రూ.10 వేలు మొత్తం నాణెళిల రూపంలో

5వ పేజీలో...

## పట్టుదలకు పరాకాష్ట..93 ఏళ్ల వయసులో పీహెచ్‌డీ పట్టా!



**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన 83వ స్నాతకోత్సవంలో 93 ఏళ్ల రేవతి తంగవేలు ఆంగ్ల భాషలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 1990లో అధ్యాపకురాలిగా పదవీ విరమణ చేసిన ఆమె సికింద్రాబాద్‌లోని కీస్ ఎడ్యుకేషనల్ సొసైటీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆంగ్లభాషలో వ్యాకరణం, వర్ణమాలతో పాటు పదాల కూర్పు వంటి అంశాలపై రేవతి తంగవేలు పరిశోధనలు చేశారు.

## కెసిఆర్ మీద పోటీ అంటే పోచమ్మ గుడి ముందే పొట్టేలును కట్టేసినట్టే : మంత్రి కెటిఆర్



**కామారెడ్డి, నవంబర్ 1 (సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్ కొడంగల్‌కు రాకపోతే తానే కామారెడ్డిలో కేసీఆర్‌పై పోటీ చేసి ఓడిస్తనని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చురకలు వేశారు. కేసీఆర్‌ను సవాల్ చేసుడంటే పోచమ్మ గుడి ముందు పొట్టేలును కట్టేసినట్టే అని రేవంత్‌ను హెచ్చరించారు. కామారెడ్డి నియోజకవర్గంలోని బిక్నూరులో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సభలో బుధవారం మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఉద్యమ సమయంలో తెలంగాణ బిడ్డలపై తుపాకీ ఎక్కుపెట్టిన రైఫిల్ రెడ్డి కేసీఆర్‌ను ఓడిస్తడట కామారెడ్డిల. కేసీఆర్ ఆగస్టు 21వ తేదీన కామారెడ్డిలో పోటీ చేస్తనని ప్రకటించినప్పటి నుంచి

5వ పేజీలో...

## నేడు మంథని నియోజకవర్గంలో రాహుల్ పర్యటన

**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** నేడు మంథని నియోజకవర్గంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటించనున్నారు. హెలికాప్టర్‌లో రాహుల్ గాంధీ అంబట్‌పల్లికి చేరుకోనున్నారు. అంబట్‌పల్లిలో ఉదయం 7.30 గంటలకు నూతన గ్రామపంచాయతీ సమీపంలో మహిళా సదస్సులో రాహుల్ పాల్గొననున్నారు. సుమారు 5 వేల మంది మహిళలతో ఈ సభ



5వ పేజీలో...

## ప్రతిపక్ష ఎంపీల ఐఫోన్ల హ్యాకింగ్!







**న్యూఢిల్లీ, నవంబర్ 1 (సమ సమాజం):** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ విపక్ష నేతల ఫోన్ల హ్యాకింగ్ వార్తలు దేశవ్యాప్తంగా పెను రాజకీయ సంచలనానికి దారితీశాయి. కాంగ్రెస్ మొదలుకుని పలు విపక్షాల ఎంపీలు తదితరుల ఐఫోన్లకు దాని తయారీ సంస్థ యాపిల్ నుంచి మంగళవారం వచ్చిన హ్యాకింగ్ అలర్టులు తీవ్ర కలకలం రేపాయి. 'ప్రభుత్వ ఆధ్వర్యంలో పని చేస్తున్న హ్యాకర్లు మీ ఐఫోన్లను నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు' అంటూ వచ్చిన హెచ్చరిక నోటిఫికేషన్లు సంచలనం సృష్టించాయి. ఇది కచ్చితంగా కేంద్రంలోని మోడీ సర్కారు పనేనంటూ విపక్ష నేతలు భగ్గుమన్నారు. ఈ ఆరోపణలను కేంద్రం తీవ్రంగా ఖండించింది. మరోవైపు ఈ కలకలం నేపథ్యంలో, తమ నోటిఫికేషన్లలో కొన్ని ఫేక్ అలర్టులు కూడా ఉండొచ్చంటూ యాపిల్ స్పందించింది. భారత్‌లోనేగాక 150

6వ పేజీలో...

## బిజెపి అభ్యర్థుల మూడో జాబితాకు అధిష్టానం కసరత్తు



**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** తెలంగాణ బీజేపీ అభ్యర్థుల మూడో జాబితాపై అధిష్టానం కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా నివాసంలో తెలంగాణ కోర్ కమిటీ భేటీ అయ్యింది. ఈ సమావేశంలో జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కిషన్ రెడ్డి, డీకే అరుణ సహా కోర్ కమిటీ సభ్యులు

5

## కెటిఆర్ కాన్వాయ్‌ను తనిఖీ చేసిన పోలీసులు



**మెదక్, నవంబర్ 1 (సమ సమాజం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ని పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి

5

## మరో పవర్‌ఫుల్ అణుబాంబు తయారు చేయనున్న అమెరికా



**వాషింగ్టన్, నవంబర్ 1 (సమ సమాజం):** హిరోషిమాపై 1945లో ప్రయోగించిన దాని కంటే 24 రెట్లు శక్తివంతమైన అణుబాంబు తయారు చేస్తామని అమెరికా ప్రకటించింది. 2030 నాటికి తమ

5

## సెన్సేషన్ కోసమే ఎంపిపై కత్తిదాడి

### సిద్దిపేట కమిషనర్ శ్వేత వెల్లడి



**సిద్దిపేట, నవంబర్ 1 (సమ సమాజం):** మెదక్‌ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఈ నెల 30వ తేదీ రోజున సూరంపల్లిలో కత్తితో నిందితుడు రాజు

6

## బంగారానికి పెరిగిన డిమాండ్



**న్యూ ఢిల్లీ, నవంబర్ 1 (సమ సమాజం):** భారత్ పసిడి డిమాండ్ 2023 క్యాలెండర్ ఇయర్ మూడవ త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 10 శాతం పెరిగి 191.7 టన్నుల నుంచి 210.2 టన్నులకుి

5

# చంద్రబాబు వ్యవహారంలో లబ్ధి పొందేదెవరు..!



తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు 53 రోజులకు ఎట్టకేలకు ఆరోగ్య కారణాలపై బెయిల్ దక్కించుకుని జైలు నుంచి బయటకు వచ్చారు. ఆయన అరెస్ట్‌తో వైసిపి లాభపడిందా..నష్టపోయిందా అన్న చర్చ ఇప్పుడు మొదలయ్యింది. ఇందులో వైసిపి లబ్ధిపొందిందా..లేక టిడిపి తనకు అనుకూలంగా మార్చు కుందా అన్న చర్చ కూడా సాగుతోంది. మొత్తంగా ఇప్పుడు బాబు అరెస్ట్..విడుదల తదనంతర పరిణామాలు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తప్పకుండా ప్రభావితం చేయబోతున్నాయనడంలో సందేహం లేదు. అది ఎవరికి ఎంతమేర నష్టం చేస్తుందా..లేక లభం చేస్తుందా అన్నది భవిష్యత్ నిర్ణయిస్తుంది. 53 రోజుల కిందట రాజకీయ పర్యటనలో ఉన్న ఆయనను నంద్యాలలో అరెస్టు చేసి విజయవాడకు తరలించడంతో మొదలైన డ్రామా దాదాపు ఇన్ని రోజులకు ఓ కొలిక్కి వచ్చింది. అయితే ముందున్నది ముసళ్ల పండగ అని వైసిపి నేతలు అప్పుడే వ్యాఖ్యానాలు చేస్తున్నారు. కానీ చంద్రబాబును అరెస్ట్ చేసిన తర్వాత రాజకీయం భిన్నంగా మారింది. ఇది టీడీపీకి మేలు చేసిందనేది ఎక్కువ మంది భావన ఏర్పడింది. కేసు ఏదైనా చంద్రబాబుకు మాత్రం జైలుజీవితం తప్పలేదు. సుదీర్ఘకాలం జైలులో ఉండక తప్పలేదు. రాజకీయంగా ఈ విషయంలో వైసిపి పైచేయి సాధించిందని ఆ పారటీ నేతలు భావిస్తున్నారు. అయితే రాజకీయంగా చంద్రబాబుకు కలసి వచ్చిందని టిడిపి నేతలు భావిస్తున్నారు. మొత్తంగా చంద్రబాబు అరెస్ట్ తదనంతర పరిణమాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడే చెప్పలేం. ఎందుకంటే ఇప్పట్లో ఈ కేసుల గోల ఇప్పుడే తెగేలా లేదు. స్కిల్ డెలవప్‌మెంట్ ప్రాజెక్టు అవినీతి కేసు కోర్టులో నిలుస్తుందా లేదా అన్నది ముమ్ముందు చూస్తాం. ఇకపోతే రాజకీయంగా ఎవరికి ఎంత లాభం అన్నది కూడా ఎన్నికల్లో తేలనుంది. అన్నింటికి మించి తెలంగాణలో టిడిప పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా పార్టీ అధ్యక్ష పదవికి కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేశారు. తెలంగాణలో పోటీ చేయాలని భావించిన తరుణంలో ఇలాంటి నిర్ణయం కాసానికి రుచించకపోవచ్చు. ఇకపోతే టిడిపి పోటీ చేయకపోవడం అన్నది తమకు అనుకూలం కాగలదని, సెటిలర్ల ఓట్లు తమకే పడతాయిన బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు భావిస్తు న్నాయి. అయితే ఇక్కడి టిడిపి అనుయాయులు కావచ్చు..అభిమానులు కావచ్చు ఎవరికి ఓటేస్తారన్నది చూడాలి. చంద్రబాబుపై ఏసీబీ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకూ క్వాష్,బెయిల్ పిటిషన్లపై విచారణలు జరుగుతున్నాయి.మధ్యంతర బెయిల్ పిటిషన్ పై తీర్పు రావడంతో బయటకు వచ్చారు. ఇప్పుడు సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్‌పై తీర్పు రావాల్సి ఉంది. ఇదంతా న్యాయపరమైన పక్రియ. ఈ వ్యవహారం లో చంద్రబాబు రాజకీయంగా కార్నర్ అయ్యారా లేకపోతే మరింత బలపడ్డారా అన్నది రాజకీయ వర్గాలకు అంతు చిక్కని విషయంగా మారింది. చంద్రబాబును అరెస్టు చేసినప్పటి నుండి ప్రపంచంలో తెలుగు వారు ఉన్న ప్రతి దేశంలోనూ ఆయనకు మద్దతుగా ప్రదర్శనలు జరిగాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగళూరు, చెన్నైల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. అమెరికా తదితర ప్రాంతాల్లోనూ మద్దతుగా ఆందోళనలకు దిగారు. యాభై రెండు రోజుల పాటు వీటిని కొనసాగిస్తూనే ఉన్నారు. చివరికి తెలుగుదేశం పార్టీ తెలంగాణలో పోటీ చేయడం లేదని ప్రకటించిన తర్వాత కూడా గచ్చిబౌలి స్టేడియంలో సీబీఎన్ గ్రాటిట్యూడ్ కాన్సర్ట్ నిర్వహించారు. స్టేడియం హౌస్ ఫుల్ అయిపోయింది. ఇలా ఏ కార్యక్రమం నిర్వహించినా చంద్రబాబుకు మద్దతుగా.. సంఘిభావం భారీగా ఉండేలా చూసుకున్నారు. రోజులు గడుస్తున్నా.. ఆ ప్రదర్శనలు కొనసాగాయి. నిజానికి చంద్రబాబు సైబరాబాద్ ను నిర్మించానని పదే పదే చెప్పుకునేవారు. కానీ ఆయన జైల్లో ఉండటం వల్ల .. ఇలాంటి ప్రచారం ఐటీ ఉద్యోగులు చేశారు. చంద్రబాబు చేసిన మంచి పనులన్నీ ప్రజలకు తెలిసేలా నిరసన

కార్యక్రమాలు చేపట్టారు. చివరికి గచ్చిబౌలిలో జరిగిన సీబీఎన్ గ్రాటిట్యూడ్ సభ కూడా.. చంద్రబాబు హయాంలో నిర్మించిన స్టేడియంలోనే జరిగింది. ఇలా ప్రతి అంశం .. చంద్రబాబు దూర దృష్టి వల్లనే తెలుగు రాష్ట్రాల్లో సంపద సృష్టి జరిగిందని.. కొత్త తరానికి కూడా తెలిసేలా చేయగలిగారన్న అభిప్రాయం వినిపిస్తోంది. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లు సీఎంగా ఉన్నారు. ఇప్పటికే తెలంగాణ లో ఆయన అధికారంలో లేక ఇరవై ఏళ్లు అయినా చంద్రబాబు ముద్ర కనిపించేలా చేసుకోగలిగారు. ఇదే విషయాన్ని బలంగా యువ ఓటర్ల దృష్టిలోకి తీసుకెళ్లగలిగారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు 73 ఏళ్ల చంద్రబాబును ఎదుర్కోలేక తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని ఆయనను జైల్లోనే ఉంచి.. ఎన్నికలకు వెళ్లాలనుకున్నారని టీడీపీ విస్తృత ప్రచారం చేసింది. చంద్రబాబు సతీమణి నిజం గెలవాలి పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నారు. నారా లోకేష్ చంద్రబాబు అరెస్టుతో ఆగిన భవిష్యత్‌కు గ్యారంటీని ప్రారంభించాలనుకున్నారు. ఈ మధ్య కాలంలో వైసీపీ మంత్రులు చేసిన వివాదాస్పద ప్రకటనలు, చంద్రబాబు మరణం, భువనేశ్వరి అరెస్టు అంటూ చేసిన ప్రకటనలను ప్రజల్లోకి తీసుకెళ్లి సానుభూతిని పెంచుకునేందుకు ప్రయత్నించారు. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో టీడీపీ నేతలు ఓ రేంజ్ లో ట్రెండింగ్ చేశారు. భారీ ర్యాలీకి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే సీఐడీ వెంటనే కోర్టుకు వెళ్లి ఎలాంటి ర్యాలీలు చేయకుండా ఆదేశాలు తీసుకు వచ్చింది. కేసు గురంచి మీడియాతో మాట్లాడకుండా ఆదేశాలు తెచ్చుకున్నారు. అయితే ఉండవల్లి నివాసానికి వెళ్లే ప్రతీ చోటా.. ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడి స్వాగతం పలికారు. దీంతో చంద్రబాబు కాన్వాయ్ చాలా నెమ్మదిగా సాగింది. ప్రజా స్పందన చూసి టీడీపీ నేతలు సంతోషపడ్డారు. చంద్రబాబు అరెస్ట్ వల్ల టీడీపీకి మేలే జరిగిందని టీడీపీ వర్గాలు ఓ అంచనాకు వస్తున్నాయి. మరో నాలుగు నెలల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తున్న సమయంలో టీడీపీకి మరింత మేలు చేసేలా పరిస్థితులు ఉన్నాయని భావిస్తున్నారు. చంద్రబాబును అరెస్టు చేయకపోతే.. ఇప్పుడున్న పరిస్థితులు ఖచ్చితంగా ఉండేవి కావన్న వాదనా ఉంది. లోకేష్ పాదయాత్ర చేసేవారు. చంద్రబాబు భవిష్యత్ గ్యారంటీ సభలు పెట్టుకునేవారు. పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తు కోసం ఇంకా సరైన కారణం కోసం వెదుకుతూ ఉండేవారు. అవన్నీ రాజకీయంగానే ఉండేవి. అయితే రాజకీయంగా టిడిపి లబ్ధి పొందిందన్న వాదనలకు బలం చేకూరుతోంది. చంద్రబాబును అరెస్ట్ చేయించగలిగారు కానీ..ప్రజల్లో అభిమానం తగ్గించలేక పోయారన్న భావన పెరిగింది. మొత్తంగా రేపటి ఎన్నికల్లో చంద్రబాబు అరెస్ట్ ప్రభావం ఉంటుందన్నది మాత్రం ఖాయం.

# భారతీయులకు థాయ్‌లాండ్ గుడ్ న్యూస్



**బ్యాంకాక్, నవంబర్ 1 (సమ సమాజం):** పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు థాయ్‌లాండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, తైవాన్ దేశాలవారు వీసా లేకుండానే తమ దేశంలో 30 రోజుల పాటు పర్యటించేందుకు అనుమతించాలని నిర్ణయించింది. నవంబరు 10వ తేదీ నుంచి వచ్చే ఏడాది మే 10 వరకు ఈ సడలింపు ఇవ్వనుంది. ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో థాయ్‌లాండ్ కేబినెట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని శ్రేట్టా థవిసిన్ తెలిపారు. గత నెలలో చైనా నుంచి వచ్చే పర్యాటకులకు థాయ్‌లాండ్ వీసా మినహాయింపును ఇచ్చింది. మలేసియా, చైనా, దక్షిణ కొరియా తర్వాత భారత్ నుంచే ఎక్కువ మంది పర్యాటకులు థాయ్‌లాండ్‌కు వెళ్తుంటారు. కొద్దిరోజుల క్రితం శ్రీలంక భారత్ సహా ఏడు దేశాల టూరిస్టులకు వీసా లేకుండానే సందర్శనకు అనుమతివ్వాలని నిర్ణయించింది.

# ఆహ్లాదకరంగా హుస్సేన్‌సాగర్

- ఒకప్పుడు మురికి కూపంగా.. నేడు సౌందర్యతీరంగా..
- సిఎం కెసిఆర్ ప్రత్యేక చొరవతో మారిన రూపురేఖలు
- ఒకవైపు డాక్టర్ అంబేద్కర్ విగ్రహం,
- మరోవైపు సచివాలయంతో ఎంతో శోభ





**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** చారిత్రక నగరానికి తిలకం పెట్టినట్లుగా ఉండే హుస్సేన్‌సాగర్ ఇప్పుడొక పర్యాటక కేంద్రంగా మారుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో అడ్డగోలు కబ్జాలు, కంపు కొట్టే దుర్గంధం ఖైరతాబాద్ సిగ్నల్ వరకు వ్యాపించేది. కానీ బీఆర్ఎస్ సర్కార్ దశల వారీ అమలు చేస్తున్న ప్రణాళికాబద్ధమైన అభివృద్ధితో హుస్సేన్‌సాగర్ రూపురేఖలు మారిపోయాయి. గడిచిన మూడేండ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్లను వెచ్చించి చారిత్రక వైభవాన్ని మరింత పెంచుతున్నది. ఓ వైపు పాలరాతి కట్టడాన్ని తలపించే నూతన సచివాలయ భవనం, ఎదురుగా అమరుల స్మారక చిహ్నం, ఆ పక్కనే దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహంతో ట్యాంక్ బండ్ పరిసరాలు అమాంతం మారిపోయాయి. తాజాగా ఏర్పాటు చేసిన లేక్‌వ్యూ పార్క్ హుస్సేన్‌సాగర్ వైపు పర్యాటకులను మరింత ఆకర్షిస్తున్నది. జలాశయం చుట్టూ హైదరాబాద్ మహానగరం సరికొత్త సొబగులతో ముస్తాబవుతున్నది. సచివాలయం ఎదుట నిర్మించిన మ్యూజికల్ ఫౌంటెన్ నగర వాసులతో పాటు ఇతర ప్రాంతాలు, విదేశీ పర్యాటకులకు ఆహ్లాదాన్నిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో నూతన సచివాలయం కీలకంగా మారింది. అలాంటి సచివాలయం పరిపాలనకు కేంద్ర బిందువుగా మారుతున్నది. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా హుస్సేన్‌సాగర్‌ను ఆట విడుపు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. వీకెండ్ వచ్చిందంటే చుట్టూ ఉన్న వివిధ పార్కులను లక్షలాది మంది సందర్శిస్తున్నారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ హెచ్ఎండీఏ ఇప్పటికే సుందరీకరణ పనులను పూర్తి చేసింది. చారిత్రాత్మక నేపథ్యం కనిపించేలా ట్యాంక్‌బండ్‌పై పలు భారీ కట్టడాలు చేపట్టారు. లుంబినీ పార్కు, ఎన్టీఆర్ గార్డెన్‌లను కలుపుతూ ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు పనులు చేపట్టారు. ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ట్‌లతో డిజైన్లు రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నారు. తెలంగాణ అమరుల త్యాగానికి ప్రతీకగా నిలిచేలా స్మారక స్థూపాన్ని అత్యంత ఆకర్షణీయంగా నిర్మించారు. ఇప్పటికే ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్కు, పీ.వీ.నరసింహారావు మార్గం (నెక్లెస్ రోడ్), సంజీవయ్య పార్కు, జలవిహార్, పీవీఘాట్, థ్రిల్ సిటీతో ఆ ప్రాంతం రూపురేఖలే మారిపోయాయి. సాగర తీరంలో నిర్మించిన లేక్‌వ్యూ పార్కు ఆ ప్రాంతానికి మరింత వన్నె తీసుకువచ్చింది. లేక్ అందాలన్నీ కనబడే విధంగా లొకేషన్ తీరం, సాగర్ ఒడ్డున కూర్చుని సేద తీరేలా అబ్బురపరిచే ప్రవేశ ద్వారం, పాత్‌వేలు, పిల్లల కోసం ప్లే గ్రౌండ్, అందాలన్నీ ఆస్వాదించేలా అండర్‌పాస్, వాటర్ థీమ్ పార్కు, సాగర్ అలలపై నిలుచున్నట్లు గ్లాసు డెక్, ఫ్లోర్ స్కేప్, ఎలివేటెడ్ వాక్‌వే విత్ అండర్ పాసెస్, పెడస్ట్రియన్ ట్రయల్స్, మూడు మీటర్ల వెడల్పుతో వేవ్ వాక్, ఇన్నోవేటివ్ చిల్డ్రన్ ప్లే ఏరియా ఇలా ఎన్నో ప్రత్యేకతలతో పర్యాటకులకు కనువిందు చేస్తున్నది..

# పాక్‌లో టెర్రరిస్టుల హత్యల్లో అంతుచిక్కని రహస్యం?



**ఇస్లామాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** కెనడాలో ఖలిస్తానీ ఉగ్రవాదులు హతమైన అనంతరం పాకిస్తాన్‌లోనూ అదే తరహా ఘటనలు వెలుగు చూస్తున్నాయి. మౌలానా జియావుర్ రెహ్మాన్ అనే మతపెద్ద కరాచీలోని గులిస్తాన్-ఎ-జౌహర్‌లోని ఒక పార్కులో పట్టపగలు హత్యకు గురయ్యాడు. రెహ్మాన్ లష్కరే కార్యకర్త. ఇద్దరు గుర్తుతెలియని దుండగులు రెహమాన్‌ను కాల్చిచంపారు. రెహ్మాన్ సాయంత్రం వాకింగ్‌కు వెళ్లినప్పుడు ఈ హత్య జరిగింది. ఈ హత్య అతని బంధువులు, స్నేహితులు, అనుచరులను ఆందోళనకు గురిచేసింది. పాకిస్తాన్‌లో మతపెద్దలు.. మతపరమైన కార్యక్రమాలతో పాటు ఇతర సామాజిక కార్యక్రమాలలోనూ పాల్గొంటారు. ఖలిస్థాన్ కమాండో ఫోర్స్ చీఫ్ పరమ్‌జిత్ సింగ్ పంజ్వార్ హత్య తీరులోనే లష్కర్ కార్యకర్త రెహ్మాన్ హత్య జరిగింది. ఉగ్రవాద ఆరోపణలతో భారత్ మోస్ట్ వాటెండ్‌గా ప్రకటించిన పంజ్వార్‌ను గత మే నెలలో లాహోర్‌లో గుర్తు తెలియని దుండగులు హతమార్చారు. పాక్ గూఢచారి సంస్థ ఐఎస్‌ఐ, టెర్రర్ బాస్‌లు ఈ రెండు హత్యల్లోనూ సారూప్యతలను గమనించారు. ఈ నేపథ్యంలో ఐఎస్‌ఐ దాదాపు డజను 'ఆస్తులను'.. 'సేఫ్ హౌస్'లో ఉంచినట్లు ఈ పరిణామాలను పర్యవేక్షిస్తున్న నిఘా వర్గాలు తెలిపాయి. రావల్‌కోట్‌లో అబూ ఖాసిమ్ కాశ్మీరీ, నజీమాబాద్‌లో ఖరీ ఖుర్రామ్ షాజాద్ అనే మరో ఇద్దరు ఎల్ఈటీ కార్యకర్తల హత్యల కారణంగా బహుశా ముందుజాగ్రత్త మరింత అవసరమని ఐఎస్‌ఐ భావించి ఉండవచ్చునని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవలే హత్యకు గురైన రెహ్మాన్.. జామియా అబూ బకర్ అనే మదర్సాలో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్నాడని సమాచారం. పాకిస్తాన్ పోలీసులు తమ ప్రెస్ నోట్‌లో ఈ హత్యను ఉగ్రవాద దాడిగా అభివర్ణించారు. దేశంలో ఉగ్రవాదుల పాత్రను ఇది సూచిస్తోందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్ పోలీసులు దీనిని టా÷-గ్గ÷ట్ కిల్లింగ్‌గా పరిగణిస్తున్నారు. రెహ్మాన్ హత్య కరాచీలో మత బోధకులపై వరుస దాడుల్లో భాగమని భావిస్తున్నారు. ఈ బోధకులంతా ఐఎస్‌ఐ ద్వారా ఉగ్రవాద గ్రూపులతో సంబంధాలను ఏర్పరుచుకున్నారు. వీరు యువతను సమూలంగా మార్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. తగిన శిక్షణ అనంతరం యువతను భారత్‌పై దాడికి పంపిస్తారని తెలుస్తోంది. కాగా గత మార్చి 1న, ఐసీ-814 ఇండియన్ ఎయిర్‌లైన్స్ హైజాకర్ అయిన పైలట్ జహూర్ ఇబ్రహీంను కాల్చి చంపారు. ఈ జైషే మహ్మద్ ఉగ్రవాదిపై గుర్తుతెలియని ముష్కరులు అతి సమీపం నుంచి రెండుసార్లు కాల్పులు జరిపారు. ఈ హత్యల పరంపర పాకిస్తాన్ చట్ట అమలు సంస్థలను, ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఐఎస్‌ఐని కలవరపరిచింది. అయితే ఈ హత్యలు ప్రత్యర్థుల కారణంగా జరిగాయని కూడా ఐఎస్‌ఐ పూర్తిగా విశ్వసించడం లేదు. మరి ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో తెలియదు.

# హమాస్ కీలక ప్రకటన



**గాజా, నవంబర్ 1 (సమ సమాజం):** ఇజ్రాయెల్‌తో యుద్ధంలో.. హమాస్ కీలక ప్రకటన చేసింది. తమ చెరలో ఉన్న బందీల్లో కొందరు విదేశీయులను వదిలిపెట్టేందుకు అంగీకరించింది. అంతర్జాతీయ సమాజం నుంచి వస్తోన్న ఒత్తిళ్ల మేరకే హమాస్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే.. గాజాపై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ బలగాలను మాత్రం వదిలే ప్రసక్తే లేదని హమాస్ స్పష్టం చేసింది. హమాస్ సైనిక విభాగం ప్రతినిధి అబు ఒబీదా మంగళవారం ఓ మీడియా సంస్థ ద్వారా మాట్లాడుతూ.. 'రానున్న రోజుల్లో కొందరు విదేశీయులను విడిచిపెడతాం. ఈ విషయాన్ని మధ్యవర్తిత్వం వహిస్తున్న వారికి తెలియజేశాం. మాపై దాడులు చేస్తోన్న ఇజ్రాయెల్ సైన్యాన్ని విడిచిపెట్టేది లేదు. గాజా ప్రాంతాన్ని వాళ్లు నాశనం చేశారు. కాబట్టి, ఇజ్రాయెలీ సైనికులు, సైన్యాధికారుల్ని చంపి అక్కడే పాతేస్తాం. వాళ్ల మృతదేహాలతో గాజా అతిత్వరలో శ్మశానంగా మారబోతోంది' అని అన్నారు. అక్టోబర్ 7న హమాస్ బలగాలు రాకెట్ లాంఛర్లతో ఇజ్రాయెల్‌పై మెరుపు దాడి చేశాయి. సరిహద్దులోని ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకుని.. దాదాపు 240 మందిని అపహరించి గాజాలో తమ బందీలుగా చేసుకుంది. వాళ్లలో ఇజ్రాయెల్ పౌరులు, సైనికులతో పాటు విదేశీయులు కూడా ఉన్నారు. వీళ్లను విడిపించాలని ఇజ్రాయెల్‌లో నిరసనలను తారాస్థాయికి చేరాయి. శాంతియుతంగా బందీలను విడిపించేందుకు ఇజ్రాయెల్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో హమాస్‌ను సర్వనాశనం చేసి మరీ బంధీలను విడిపిస్తామని ఇజ్రాయెల్ ప్రతిన బూనింది. గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడుతోంది. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ దాడి కారణంగా ఇప్పటి వరకు 8,525 మంది మృతి చెందినట్లు హమాస్ ఆధీనంలోని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మృతి చెందిన వారిలో 3,500 మంది చిన్నారులే ఉన్నట్లు పేర్కొంది.

# అమెరికాలో హిందూ ఆలయంలో హుండీ దొంగతనం

**న్యూయార్క్, నవంబర్ 1 (సమ సమాజం):** అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం శాక్రమెంటో నగరంలోని పార్క్‌వే ప్రాంతంలో ఉన్న ఓం రాధా కృష్ణ మందిరంలోని హుండీ చోరీకి గురైంది. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మొత్తం ఆరుగురు దుండగులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులు వచ్చేటప్పటికి వారిలో ఇద్దరు గుడిలోనే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనను ఉత్తర అమెరికా హిందువుల సమాఖ్య ఖండించింది.

# పన్నెండు వేల మంది ప్రవాసులపై కువైట్ బహిష్కరణ వేటు

**కువైట్, నవంబర్ 1 (సమ సమాజం):** కువైట్ కేవలం 3 నెలల్లో సుమారు 12 వేల మంది ప్రవాసులను వారి దేశాలకు పంపించేసింది. ఈ ఏడాది అగస్టు నుంచి అక్టోబర్ వరకు 12 వేల మందిని బహిష్కరించింది. వివిధ నేరాలతో పాటు ప్రజా నైతిక నిబంధనల ఉల్లంఘన, కార్మిక చట్టాల అతిక్రమణ ఆరోపణలతో అక్టోబర్‌లో 4,300 మందిని వెళ్లగొట్టారు. చట్ట ఉల్లంఘనలకు పాల్పడకుండా అడ్డు కోవడానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నప్పటికీ ప్రవాసీయుల సంఖ్యను తగ్గించుకోవ డానికే కువైట్ ఈ చర్యలకు పాల్పడుతున్నదన్న విమర్శలున్నాయి.

# బెంగళూలో అర్ధరాత్రి ప్రాణభయంతో పరుగులు



**బెంగళూరు, నవంబర్ 1 (సమ సమాజం):** ఓ వ్యక్తి ప్రాణభయంతో పరుగు లు తీస్తుండగా వెనుకే ఓ స్కార్పియో వాహనం అతడిని తరుముతోంది. చివరికి అతడిని బలంగా ఢీకొట్టి అంతే వేగంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాధితుడు ఘటనా స్థలిలోనే ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరు నగరంలోని పులకేశి నగర్‌లో అక్టోబర్ 18వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో అందరూ చూస్తుండగానే జరిగిన దారుణమిది. మృతుడిని అస్గర్‌గా గుర్తించిన పోలీసులు, సాధారణ రోడ్డు ప్రమాద కేసుగా భావించారు. అయితే, మృతుడి స్నేహితుడిచ్చిన సమాచారంతో దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడు అమ్రీన్, అతడి వెంట ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. డబ్బు వివాదం కారణంగానే తామీ పనికి పూనుకున్నట్లు వారు అంగీకరించారు. దీంతో ముగ్గురిపైనా పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. అస్గర్ సెకండ్ హ్యాండ్ కార్ డీలర్ కాగా, అతడి వద్ద అమ్రీన్ కారు కొనుగోలు చేశాడు. దీనికి సంబంధించి అతడు అస్గర్‌కు రూ.4 లక్షలు బకాయి పడ్డాడు. దీనిపై ఇద్దరి మధ్యా ఘర్షణ జరిగింది. అస్గర్ తనపై దాడి చేశాడంటూ అమ్రీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసు వెనక్కి తీసుకోవాలని అస్గర్ కోరగా అమ్రీన్ నిరాకరిస్తున్నాడు. ఘటన జరిగిన రాత్రి మాట్లాడు కుందాం రమ్మని అస్గర్‌ను అమ్రీన్ పిలిచాడు. చెప్పినచోటుకు రాగానే ప్లాన్ ప్రకారం అతడిని కారుతో ఢీకొట్టి చంపాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో ఈ ఘటన ఆ సాంతం వీడియో తీశాడని పోలీసులు చెప్పారు.

# ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన మాగంటి గోపీనాథ్




**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరోసారి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తల్వార్లతో హల్‌చల్ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎన్నికల ప్రచారంలో తల్వార్లతో కార్యకర్తలు హంగామా సృష్టించారు. ఎర్రగడ్డ ఎన్నికల ప్రచారంలో తల్వార్లతో విన్యాసాలు చేశారు. ఈ విన్యాసాలకు సంబంధించిన వీడియోను స్వయంగా ఎమ్మెల్యే మాగంటి తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ కార్యకర్తలు తల్వార్లతో పోటీ చేయడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ విన్యాసాలు జరిగే సమయంలో పోలీసులు అక్కడే ఉన్నా అడ్డుకోకపోవడంపై విపక్షాలు మండిపడుతున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఆయుధాలు వాడటం ఏంటని ఈసీకి జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు.

# డబుల్ బెడ్రూం నిర్మాణంలో మొదటి స్థానంలో బాన్సువాడ

**నియోజకవర్గంపై పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ**

**11 వేలకు పైగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు**



**బాన్సువాడ, నవంబర్ 1 (సమ సమాజం):** బాన్సువాడ నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటయ్యింది. ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గంలో గట్టి పట్టున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో ఆయనకు ఎదురులేకుండా పోయింది. 2011 నుంచి బాన్సువాడ సెగ్మెంట్‌లో గులాబీ జెండా ఎగురుతున్నది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తనకున్న సాన్నిహిత్యం వల్ల శ్రీనివాసరెడ్డి భారీగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడ 11 వేలకు పైగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేయించి నంబర్ వన్ స్థానంలో నిలిపారు. కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరోమారు శ్రీనివాస్‌రెడ్డిని విజయతీరాలకు చేర్చనున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొమ్మిదేండ్లలో రూ.10 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియా ప్రాంతాలకు సాగునీరు ఇవ్వాలన్న లక్ష్యంతో సిద్ధాపూర్‌లో రూ.200 కోట్ల వ్యయంతో మూడు చెరువులను కలిపి రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.300 కోట్లతో చందూర్, జాకోరా ఎత్తిపోతలను మంజూరు చేసింది. రూ.7 కోట్లతో కల్కి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చింది. ఈ చెరువు తీరాన రూ.4 కోట్లతో ఆక్సిజన్ పార్కు, చిల్డ్రన్స్ పార్కును నిర్మించింది. బాన్సువాడ ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల ఏర్పాటయ్యింది. ఎమ్మెల్యే పోచారం చొరవతో నర్సింగ్ కాలేజీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ, వృత్తి విద్యా కోర్సు కళాశాలలు, మహిళా కళాశాల, పోస్టు మెట్రిక్ వసతి గృహాలు అన్నీ కలిపి సుమారు 30 కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను మంజూరు చేయించారు. తాజాగా బాన్సువాడ పట్టణంలో రూ. 70 లక్షలతో ఉర్దూ మీడి యం జూనియర్ కళాశాల, రూ. 2.5కోట్లతో జూనియర్ కళాశాల భవనాలను నిర్మించారు. యువత కోసం రూ.2 కోట్లతో ప్రొఫెసర్ జయశంకర్ మినీస్టేడియాన్ని నిర్మించారు. బాన్సువాడ దవాఖానలో వసతులు మెరుగుపరిచారు. దాదాపు రూ.100 కోట్లతో ప్రభుత్వ దవాఖానలను ఆధునీకరించి పేదలకు ఉచితంగా కార్పొరేట్ తరహా వైద్య సేవలందిస్తున్నారు. దీంతో బాన్సువాడలోని ఏరియా దవాఖానకు మూడుసార్లు కాయకల్ప, నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ అవార్డు దక్కింది. రూ. 20కోట్ల నిధులతో మరో వంద పడకల మాతాశిశు దవాఖానను అందుబాటులోకి తెచ్చారు. దవాఖానకు బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ ఇనిషియేటివ్ అవార్డుతో గ్రేడ్-1 సాధించింది. కోటగిరి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని రూ.13 కోట్లతో 50 పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేయించారు. పొతంగల్ పీహెచ్‌సీ.. కాయకల్పతోపాటు మరో జాతీయ అవార్డుకు ఎంపికైంది.

# అసెంబ్లీ ఎన్నికలకు డీకే అరుణ దూరం

**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ.. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ భారతీయ జనతా పార్టీలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే పలువురు కీలక నేతలు కాషాయం కండువా తీసేసి ఇతర పార్టీలకు జంప్ అవుతున్నారు. మరికొందరు ముఖ్యనేతలు ఈసారి జరిగే ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు.తెలంగాణలో ప్రభుత్వ వ్యతిరేకతో వలసలతో కిక్కిరిసిపోయిన తెలంగాణ బీజేపీకి.. ఎన్నికల సమయంలో అగ్రనేతలు వరుసగా షాక్ ఇస్తున్నారు. అనేక మంది సీనియర్ నేతలు ఎన్నికల పోటీ నుంచి తప్పుకుంటున్నారు. ఏకంగా మాజీ ఎమ్మెల్యేలు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, తాజాగా వివేక్ వెంకట స్వామి బీజేపీకి గుడ్‌బై చెప్పేశారు. మరోవైపు ఇప్పటికే ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పోటీకి దూరంగా ఉంటున్నట్టు ప్రకటించారు. తాజా ఈ జాబితాలోకి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ చేరారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం చేస్తామని స్పష్టం చేస్తామంటున్నారు. రాష్ట్ర మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిరాసక్తి చూపుతున్నారు. ఈ మేరకు ఆమె కీలక ప్రకటన చేశారు. గద్వాల అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. ఈసారి గద్వాల్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉండబోనని అధిష్టానానికి తేల్చి చెప్పారు డీకే అరుణ. అయితే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేస్తానని స్పష్టం చేశారు. తన స్థానం గద్వాలలో బీసీ అభ్యర్థిని బరిలోకి దింపుతామని వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బీసీ అభ్యర్థిని బీజేపీ ప్రకటించింది. ఈ అంశాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తానని డీకే అరుణ స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ వైపు పెరుగుతున్న ఆదరణ చూసి, కాంగ్రెస్‌ను పైకి లేపేలా అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని అంటే బీజేపీతోనే సాధ్యం అని ప్రజలు భావిస్తున్నారని స్పష్టం చేశారు డీకే అరుణ. డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటేనే రాష్ట్ర ఆర్థిక స్థితి, ప్రజల జీవన స్థితి మెరుగుపడుతుందన్నారు అరుణ. కాంగ్రెస్ అడ్డగోలుగా హామీలు ఇస్తూ తెలంగాణను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీకి పోటీ చేయను అని గతంలోనే చెప్పానని, బీసీ సీఎం నినాదం నేపథ్యంలోనే గద్వాల స్థానం నుంచి బీసీ అభ్యర్థిని నిలబెడుతున్నామని డీకే అరుణ తెలిపారు. భారతీయ జనతా పార్టీ కీలక నేతలే ఒక్కొక్కరుగా పోటీ నుంచి తప్పుకుంటుంటే పార్టీ నేతలే షాక్ అవుతున్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న భావలో ఉన్నారట పార్టీ శ్రేణులు. ఏది ఏమైనా ప్రస్తుతం డీకే అరుణ తీసుకున్న నిర్ణయం భారతీయ జనతా పార్టీలో అనిశ్చితి నెలకొందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

# అవకాశం ఇస్తే ఖమ్మం అభివృద్ధికి కృషి చేస్తా

**తుమ్మల నాగేశ్వరరావు**



**ఖమ్మం, నవంబర్ 1 (సమ సమాజం):** : కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మద్దతుగా బుధవారం తెలంగాణ తొలి దశ మలి దశ ఉద్యమ కారులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుమ్మలతోపాటు ఉద్యమ కారులు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, డాక్టర్ కేవీ కృష్ణారావు, ఎర్నేని రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ తెలంగాణ తొలిదశ మలిదశ ఉద్యమ కారులు తనకు సంఘీభావంగా నిలవడం మీ ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనమన్నారు. భగవంతుడు ఇచ్చిన శక్తి మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించానని, గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా శస్య శ్యామలం చేయడం కోసమే నాడు టీఆర్ఎస్ లో చేరానని, మోసకారి నాటకాల స్వార్థ పూరిత కేసీఆర్ ప్రభుత్వ వైఖరి నచ్చకే కాంగ్రెస్‌లో చేరానన్నారు. ఉద్యమ కారులకు ఇంటి స్థలాల వాగ్దానం ఆరు గ్యారంటీ పథకాల్లో ఉందన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం ఉద్యమ కారులు కథం తొక్కడం సంతోషమని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# కాంగ్రెస్‌తో లెఫ్ట్ పార్టీల పొత్తుపై కీలక భేటీ

**పొత్తులపై సుదీర్ఘ చర్చ**



**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** కాంగ్రెస్‌తో లెఫ్ట్ పార్టీల పొత్తుపై కీలక భేటీ జరగనుంది. గత కొద్దిరోజులుగా పొత్తుపై సందిగ్ధం కొనసాగుతోంది. కాసేపట్లో వేర్వేరుగా సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. పొత్తు, సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్‌కు సీపీఎం డెడ్ లైన్ విధించింది. కాంగ్రెస్ నుంచి స్పందన లేకపోవటంతో ఒంటరిగా బరిలో ఉండాలని సీపీఎం నిర్ణయించింది. 5 నుంచి 8 స్థానాల్లో బరిలో ఉండాలని భావిస్తోంది. సీపీఐకు కేటాయించిన కొత్తగూడెం స్థానం కూడా ఇచ్చేందుకు కాంగ్రెస్ సుముఖంగా లేదు. కాంగ్రెస్ పొత్తు ధర్మం పాటించడం లేదని కమ్యూనిస్టులు అంటున్నారు. ఈ క్రమంలోనే తీవ్ర అసంతృప్తిలో కమ్యూనిస్టులు ఉన్నారు. కాంగ్రెస్‌తో పొత్తుపై ఉభయ కమ్యూనిస్టులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# పేటీఎంలో రైలు టికెట్ బుకింగ్‌పై కొత్త ఫీచర్..సీటు గ్యారంటీ!



**న్యూఢిల్లీ, నవంబర్ 1 (సమ సమాజం):** ప్రముఖ చెల్లింపులు, ఆర్థిక సేవల సంస్థ పేటీఎం రైలు టికెట్ల బుకింగ్‌పై సీటు గ్యారంటీ సేవను ప్రారంభించింది. దీని వల్ల యూజర్లు పేటీఎంపై రైలు టికెట్ బుక్ చేసుకోవడం ద్వారా కన్ఫర్మ్‌డ్ టికెట్ పొందొచ్చని వన్97 కమ్యూనికేషన్స్ (పేటీఎం మాతృ సంస్థ) ప్రకటించింది. కన్ఫర్మ్‌డ్ టికెట్ కోసం ఒకటికి మించిన రైలు ఆప్షన్లను అందిస్తున్నట్టు తెలిపింది. ఇందుకోసం యూజర్లు పేటీఎం యాప్‌పై రైలు టికెట్ బుకింగ్ సమయంలో ఆల్టర్నేటివ్ స్టేషన్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. యూజర్ ఎంపిక చేసుకున్న రైలులో టికెట్‌లకు వెయిట్ లిస్ట్ చూపిస్తే, అప్పుడు ఆల్టర్నేటివ్ స్టేషన్ ఆప్షన్ కనిపిస్తుంది. ఇది సమీప స్టేషన్‌లకు ఏ రైలులో టికెట్లు అందుబాటులో ఉన్నది చూపిస్తుంది. దీనివల్ల సీటు లేదన్న ఆందోళన ఉండదని పేటీఎం తెలిపింది.

# స్వలింగ వివాహాలపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్




**న్యూఢిల్లీ, నవంబర్ 1 (సమ సమాజం):** : స్వలింగ వివాహాలకు చట్టబద్ధమైన గుర్తింపు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 17న ఈ కేసును విచారించిన అత్యున్నత న్యాయస్థానం చట్టబద్ధమైన గుర్తింపుకు నిరాకరించింది. దీనిపై చట్టాలు రూపొందించే బాధ్యత పార్లమెంటుదే అని స్పష్టం చేసింది. ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఈ తీర్పును వెల్లడించింది. స్వలింగ పెళ్లిళ్లు చేసుకునే ప్రాథమిక హక్కు లేదని స్పష్టం చేసింది. అయితే దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలైంది. స్వలింగ వివాహం కేసులో పిటిషనర్లలో ఒకరు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉంటే భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ కిషన్ కౌల్ స్వలింగ భాగస్వాముల గుర్తింపు కోసం వాదించారు. LGBTQIA వ్యక్తుల హక్కులను కాపాడేందుకు వివక్ష వ్యతిరేక చట్టాల కోసం వీరు పోరాడారు. ఐదుగురు న్యాయమూర్తులు బెంచ్ ఇలాంటి జంటలు దత్తత తీసుకోవడం, సివిల్ యూనియన్ గుర్తింపును అంగీకరించలేదు. దత్తతకు వ్యతిరేకంగా 3:2 తీర్పు ఇచ్చింది. ఇలాంటి జంటల సంబంధాన్ని 'వివాహం'గా చట్టబద్ధంగా గుర్తించకుండా, వారి హక్కులు, అర్హతలను పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# బిఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న వలసలు

**ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో పలువురు చేరిక**



**జనగామ, నవంబర్ 1 (సమ సమాజం):** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌కు జై కొడుతున్నారు. తాజాగా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామం గుట్ట కింది తండాకి చెందిన బంజారా నాయకులు10 మంది, లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సమ్మన్న, సోమయ్య, యాదగిరి తదితరులు, తొర్రూరు మండలం కంఠయపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, తొర్రూర్ మున్సిపాలిటీ ఐదవ వార్డ్ దుబ్బ తండాకి చెందిన కాంగ్రెస్, బిజెపి నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం పని చేయాలని కోరారు. ఎన్నికల తర్వాత వారి వారి గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లోకి చేరిన ముద్దగోని రాంమోహన్‌గౌడ్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఎల్బీనగర్ కాంగ్రెస్ నాయకుడు ముద్దగోని రామ్మోహన్ గౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. తిరిగి గులాబీ గూటికి చేరుకున్నారు. కొద్దిరోజుల క్రితం వరకు రామ్మోహన్ గౌడ్ బీఆర్ఎస్‌లోనే ఉండేవారు. అయితే ఆయనకు టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ, కాంగ్రెస్ పార్టీ కూడా ఆయనకు టికెట్ ఇవ్వకపోవడంతో తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. రామ్మోహన్ గౌడ్, ఆయన భార్య, కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నలకు గులాబీ కండువా కప్పి మంత్రి హరీష్ రావు పార్టీలోకి ఆహ్వానించారు. రామ్మోహన్ గౌడ్?తో పాటు ఆయన అనుచరులు కూడా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. 'రామ్మోహన్ గౌడ్ ఉద్యమకారుడు. మాతో కలిసి పని చేశాడు. సహచరుడిని కాపాడుకోవాలని ఇక్కడకు వచ్చాను. కష్టకాలంలో పార్టీ కోసం పని చేశాడు. ముక్కు సూటితత్వం ఉన్న మనిషి. రెండు సార్లు టికెట్ ఇచ్చాం, కానీ స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు తోడ్పాటు అందించారు. 11 మంది కార్పొరేటర్లను ఆయనే గెలిపించారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి టికెట్ ఆశించి భంగపడ్డారు. రామ్మోహన్ గౌడ్‌కు బీఆర్ఎస్ పార్టీ తగిన ప్రాధాన్యమిస్తుంది. ఆయన వెంట వచ్చే కార్యకర్తలకు తగిన అవకాశాలు ఉంటాయి. పార్టీ ప్రతినిధిగా నేను ఇక్కడికి వచ్చాను. అందుకు నేనే బాధ్యత తీసుకుంటాను. మన ఇంటి సమస్య మనం పరిష్కరించుకుందాం. కాంగ్రెస్ గెలిచేది లేదు. డబ్బాలో రాళ్ళు వేసి కొడుతున్నారు. అన్ని సర్వేలు బీఆర్ఎస్ గెలుపు ఖాయం అంటున్నాయి. హైకమాండ్ ఢిల్లీలో ఉండే పార్టీ కావాలా, గల్లీలో ప్రజల మధ్య ఉండే పార్టీ కావాలా ప్రజలు ఆలోచిస్తున్నారు' అని మంత్రి అన్నారు.

# ప్రవళిక ఆత్మహత్య కేసులో మరో ట్విస్ట్



**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** ప్రవళిక ఆత్మహత్య కేసులో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. శివరాం రాథోడ్ బెయిల్ రద్దు చేయాలని చిక్కడపల్లి పోలీసులు అప్పీల్ పిటిషన్ వేశారు. ఇప్పటికే ప్రవళిక ఆత్మహత్య కేసులో శివరాం రాథోడ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు, శివరాం రాథోడ్ వ్యతిరేకంగా సాక్ష్యాలు సమర్పించనందున నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నాంపల్లి కోర్టు బెయిల్ రద్దు చేయ్యాడాన్ని చిక్కడపల్లి పోలీసులు సవాల్ చేశారు. ఇదే కేసు ఇన్‌స్పెక్టర్‌ను సీపీ సందీప్ శాండిల్య సస్పెండ్ చేశారు.

# ప్రతిపక్ష ఎంపీల ఐఫోన్ల హ్యాకింగ్!



(మొదటి పేజి తరువాయి) దేశాల్లో పలువురు యూజర్లకు ఇలాంటి అలర్టులు వచ్చాయని పేర్కొంది. అయితే ఈ అలర్టులకు దారితీసిన కారణాలను బయట పెట్టేందుకు నిరాకరించింది. ఇంతకూ అలర్టులో ఏముందంటే...ప్రభుత్వ ఆధ్వర్యంలో పని చేసే హాకర్లు మీ ఐఫోన్‌ను టార్గెట్ చేసుకుని ఉండొచ్చని యాపిల్ అనుమానిస్తోంది. బహుశా మీ హోదా, మీరు చేస్తున్న పనుల వల్ల మీరు వ్యక్తిగతంగా వారి లక్ష్యంగా మారి ఉండొచ్చు. ఇలాంటి ప్రభుత్వ ఆధ్వర్యంలోని హాకర్లు మీ ఫోన్‌ను హాక్ చేసి తమ అదీనంలోకి తీసుకుంటే అందులోని సున్నితమైన డేటా, సమాచారంతో పాటు కెమెరా, మైక్రోఫోన్ వారి చేతిలోకి వెళ్లిపోతాయి. ఇది ఫేక్ హెచ్చరికే అయ్యుండే ఆస్కారమూ లేకపోలేదు. కానీ దయచేసి దీన్ని సీరియస్‌గా తీసుకోండి' ఈ అలర్టులు అందుకున్న నేతల్లో మల్లికార్జున ఖర్గే, శశి థరూర్, పవన్ ఖేరా, కె.సి.వేణుగోపాల్, సుప్రియా శ్రీనేత్, టి.ఎస్.సింగ్‌దేవ్, భూపీందర్ సింగ్ హుడా, రాహుల్‌గాంధీ సహాయకులు, మహువా మొయిత్రా (టీఎంసీ), సీతారాం ఏచూరి (సీపీఎం), ప్రియాంకా చతుర్వేది (శివసేన?యూబీటీ), రాఘవ్ ఛద్దా (ఆప్), అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్), సమీర్ సరణ్ (ఓఆర్ఎఫ్ అధ్యక్షుడు), సిద్దార్థ్ వరదరాజన్ (ద వైర్ వ్యవస్థాపక ఎడిటర్), ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ ఓఎస్డీ తదితరులు ఉన్నారు. కాగా, హ్యాకింగ్ ఉదంతంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. విపక్ష నేతల ఐఫోన్ల హ్యాకింగ్ కచ్చితంగా మోదీ సర్కారు పనేనంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. 'మేం భయపడేది లేదు. మా ఫోన్లను ఎంతగా హాకింగ్ చేసుకుంటారో చేసుకోండి. మీకు కావాలంటే చెప్పండి, నా ఫోన్ కూడా ఇస్తా' అంటూ విరుచుకుపడ్డారు. పారిశ్రామికవేత్త గౌతం అదానీయే ప్రస్తుతం దేశాన్ని రిమోట్ కంట్రోల్‌తో నడుపుతున్నారని ఆరోపించారు. 'ఇప్పుడు దేశంలో అదానీయే నంబర్ వన్. తర్వాతి స్థానాల్లో మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉన్నారు. మోదీ ఆత్మ అదానీ దగ్గరుంది. అందుకే అదానీని ఎవరైనా ఒక్క మాటన్నా వెంటనే నిఘా వర్గాలు రంగంలోకి దిగుతున్నాయి. మరోవైపు, విపక్ష నేతల ఆరోపణలను కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొట్టిపారేశారు. మోడీ నాయకత్వంలో దేశ ప్రగతిని చూసి ఓర్వలేక ఇలాంటి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అయితే ఈ ఉదంతంపై కూలంకషంగా దర్యాప్తు జరిపించి నోటిఫికేషన్ల వ్యవహారాన్ని నిగ్గుదేలుస్తామని ప్రకటించారు. 'పూర్తి పారదర్శకంగా సరైన సమాచారాన్ని అందజేయడం ద్వారా విచారణలో మాతో కలిసి రావాల్సిందిగా యాపిల్‌ను కోరాం. ముఖ్యంగా ప్రభుత్వ దన్నుతో హ్యాకింగ్ జరగవచ్చని ఏ ఆధారంతో చెప్పారో వివరించాలని సూచించాం. ఇది పూర్తిగా సాంకేతికపరమైన దర్యాప్తు. కనుక కంప్యూటర్ సెక్యూరిటీ సంబంధిత అంశాలకు బాధ్యత వహించే జాతీయ నోడల్ ఏజెన్సీ దీన్ని చేపడుతుంది.' అని మంత్రి ప్రకటించారు.

# కొందరికి ఈ ఎన్నికలు ప్రత్యేకం

## మరోమారు గెలుపుకోసం పలువురి యత్నం ● సీనియర్లు పలువురు అదృష్టం కోసం పోరాటం

**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** తెలంగాణలో కొందరు నేతలు ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. పలువురు సీనియర్లు ఆయా నియోజకవర్గాల్లో వరుసగా గెలుస్తూ ప్రజల్లో పట్టు సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేక పవనాలు వీచినా వారిని విజయాలే వరించాయి. రాష్ట్ర అసెంబ్లీలో అడుగుపెట్టాలని రాజకీయ నేతలందరికీ ఉంటుంది. కొందరు నేతలు ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేకముద్ర వేసుకున్నారు. పార్టీలు మారినా, నియోజకవర్గాలు మారినా వారిని విజయాలే వరిస్తున్నాయి. ప్రతికూల రాజకీయ పరిస్థితులకు ఎదురొడ్డి ప్రజల నాడిని పట్టుకోవడంలో సక్సెస్ అవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఎదురులేదని నిరూపించుకుంటున్నారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి దానం నాగేందర్, అక్బరుద్దన్ ఓవైసీ గ్రేటర్ రాజకీయాల్లో వీరంతా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఏటికి ఎదురీదిన వారిలో శ్రీధర్ బాబు ముందు వరుసలో ఉంటారు. 1999 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ గాలి వీచింది. మంథనిలో మాత్రం శ్రీధర్ బాబు గెలుపొందారు. మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆరోసారి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు. 1999, 2004, 2009, 2018 వరుస ఎన్నికల్లో గెలుపొందారు. ఒక్క 2014లో మాత్రమే శ్రీధర్ బాబు ఓటమి పాలయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు చేతిలో పరాజయం పొందారు. ఆ తర్వాత 2018 ఎన్నికల్లో పుట్ట మధుపై శ్రీధర్ బాబు గెలుపొందారు. 2009 లో గెలిచిన శ్రీధర్ బాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన తండ్రి దుద్దిళ్ల శ్రీపాదరావు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా పనిచేశారు. స్పీకర్ పదవికే వన్నె తెచ్చారు శ్రీపాదరావు. అలాగే తెలంగాణ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి...ఇప్పటికే నాలుగుసార్లు విజయం సాధించారు. మొదటి సారి 2000 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో...చేవెళ్ల నుంచి పోటీ చేసి తొలిసారి గెలుపొందారు. ఆ తర్వాత 2004లోనూ అక్కడి నుంచే విజయం సాధించారు. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు తొలి మహిళా హోం శాఖ మంత్రిగా పని చేశారు. అంతకు ముందు ఆమె భర్త ఇంద్రారెడ్డి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో హోంశాఖ మంత్రిగా పని చేశారు. భార్యాభర్తలు ఇద్దరూ హోంమంత్రిగా పనిచేసి రికార్డు సృష్టించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రెండు వేర్వేరు పార్టీల నుంచి గెలుపొందారు. 2009లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి...కాంగ్రెస్ తరపున గెలుపొందారు. వైఎస్ కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014లో పోటీ దూరంగా ఉన్న ఆమె...2018లో గెలుపొందిన తర్వాత గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ ఎన్నికల్లో గెలిస్తే...ఐదోసారి గెలుచినట్లవుతుంది. మల్కాజ్‌గిరి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు... ఇప్పటికే మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. నాలుగోసారి అదృష్టం పరీక్షించుకుంటున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రామాయంపేట నుంచి 2008 ఉప ఎన్నికల్లో మొదటిసారి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో తెలుగుదేశం అభ్యర్థిగా మెదక్ స్థానం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014లో మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2017లో ఎమ్మెల్యే కోటా నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2018లో మల్కాజిగిరి నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ఇప్పటికే మూడుసార్లు గెలుపొందారు టి.ప్రకాశ్‌గౌడ్. 2009, 2014లో తెలుగుదేశం పార్టీ తరపున విజయం సాధించిన ప్రకాశ్‌గౌడ్...రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. 2018లో రాజేంద్రనగర్ నుంచి గెలుపొంది హ్యాట్రిక్ కొట్టారు. 2023లోనూ బరిలోకి దిగారు. పార్టీలు మారినా వరుస ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ కొట్టారు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి. నాలుగోసారి గులాబీ పార్టీ తరుపున పోటీ చేస్తున్నారు. 2009లో తెలుగుదేశం పార్టీ నుంచి మొదటిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2014లోనూ అదే పార్టీ నుంచి గెలుపొందారు. రాష్ట్ర విభజనతో బీఆర్ఎస్‌లో చేరారు. గత శాసనసభ ఎన్నికల్లో గులాబీ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇబ్రహీంపట్నం నుంచి నాలుగోసారి పోటీ చేస్తున్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి మరోసారి బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే ఐదుసార్లు గెలుపొందిన తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోసారి గెలుపు కోసం బీఆర్ఎస్ తరపున బరిలోకి దిగారు. ఇప్పటికే ఇంటింటి ప్రచారం మొదలెట్టారు. ఐదుసార్లు శాసనసభకు వేర్వేరు పార్టీల తరుపున ఎన్నికయ్యారు. 1986లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తలసాని శ్రీనివాస్ యాదవ్, 1994లో సికింద్రాబాద్ నుంచి తెలుగుదేశం పార్టీ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో రెండోసారి గెలుపొంది చంద్రబాబు నాయుడు కేబినెట్ లో మంత్రి అయ్యారు. 2004లో ఓడిపోయినా... 2008 ఉప ఎన్నికల్లో గెలుపొందారు. మళ్లీ 2009లో ఓటమి పాలయ్యారు. 2014లో సికింద్రాబాద్ నుంచి సనత్‌నగర్‌కు మారారు. తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేసీఆర్ కేబినెట్ లో సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2018లోనూ అదే నియోజకవర్గం నుంచి గెలిచారు. సనత్ నగర్ నుంచి హ్యాట్రిక్ కొట్టాలన్న లక్ష్యంలో ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరా సతీమణి కోట నీలిమ కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు. గతంలో ఆమె జర్నలిస్టుగా పని చేశారు. కోట నీలిమ సీనియర్ నేత తలసానిని ఢీ కొట్టబోతున్నారు. మాజీ మంత్రి దానం నాగేందర్ పేరు హైదరాబాద్ రాజకీయాల్లో అందరికి సుపరిచితమే. ఆరోసారి అసెంబ్లీ మెట్లు ఎక్కడమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. 2018 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరారు. ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఇప్పటి వరకు ఆయన ఐదు పర్యాయాలు అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. ఆసిఫ్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల నుంచి 1994, 1999, 2004లో శాసనసభ్యుడిగా గెలుపొందారు. 2009, 2018లో ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 2014లో ఖైరతాబాద్‌లో, అంతకుముందు ఆసిఫ్‌నగర్‌లో పరాజయాలు ఎదురయ్యాయి. మరోసారి విజయం కోసం గట్టిగానే తలపడుతున్నారు. 2004 టికెట్ దక్కకపోవడంతో టీడీపీ తరపున పోటీ చేసిన దానం విజయం సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అదే స్థానం నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు చేపట్టడంలో కాంగ్రెస్ లో చేరారు. 2009 ఎన్నికల్లో గెలుపొంది వైఎస్ మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. చాంద్రాయణగుట్ట నుంచి ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ 1999 నుంచి వరసగా గెలుస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈసారి గెలిస్తే అరుదైన డబుల్ హ్యాట్రిక్ రికార్డు ఆయన పేరున ఉంటుంది. నగరంలో ఒకే నియోజకవర్గం నుంచి ఒకే పార్టీ తరుపున ఇన్ని పర్యాయాలు ఇప్పటి వరకు ఎవరూ వరుసగా గెలవలేదు.

# సెన్సేషన్ కోసమే ఎంపిపై కత్తిదాడి



(మొదటి పేజి తరువాయి) దాడి చేశాడని సీపీ శ్వేత తెలిపారు. బుధవారం నాడు సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ శ్వేత మీడియాతో మాట్లాడుతూ...ప్రజల ఆగ్రహంతో ఎంపీపై కత్తితో దాడి చేసిన వ్యక్తి రాజుపై దాడి చేశారు. ఈ దాడికి సంబంధించి అన్నీ ఆధారాలు సేకరించాము. దాడి చేసిన వ్యక్తి పలు న్యూస్ ఛానళ్లలో రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం కత్తినీ కొని ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై నేరం చేయడానికి సిద్ధం అయ్యారు. నిందితుడిని నేడు కోర్టు ముందు హాజరు పరచగా జడ్జి 14రోజుల రిమాండ్ విధించారు. నిందితుడికి ఎవరైనా సహకారం ఉందా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నాము. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్ట్‌లు పెట్టవద్దు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి నిందితుడు రాజు ఎవరి సహకారం తీసుకోలేదు, అతనొక్కడే ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేశారు. నిందితుడు సెన్సేషనల్ క్రియేట్ చేయడానికే దాడి చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని సీపీ శ్వేత తెలిపారు.

# పక్కా ప్లాన్ ప్రకారమే... బీజేపీలోకి చలమల్ల

## రాజగోపాల్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా చలమల్ల చీకటి ఒప్పందం?

- పార్టీలు మారాలని ముందే చర్చించుకున్న రాజగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి
- పాల్వాయి స్రవంతిని డమ్మీ చేయాలని ఆది నుంచి కుట్రలు
- కుట్ర రాజకీయాలకు స్రవంతి బలి
- బీజేపీలో చేరాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలు !
- బీజేపీ పార్టీలో చేరిన చలమల్ల కృష్ణారెడ్డి




**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** కొంత మంది రాజకీయ నాయకులు వారి రాజకీయ స్వలాభం కోసం ఎంతవరకైనా దిగజారుతున్నారు. ఇటీవల చలమల్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన వంట్లో అనువనువు కాంగ్రెస్ రక్తమేనని, కాంగ్రెస్ కోసమే పనిచేస్తానని మీడియా ముందు ప్రగల్భాలు పలికిన కొన్ని గంటలకే బీజేపీ పార్టీలోకి చేరారు. అంతకు ముందు బీజేపీ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన రాజగోపాల్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చిన విషయం విదితమే. అయితే గత కొన్ని రోజుల క్రితమే కోమటిరెడ్డి బ్రదర్స్‌తో చలమల్ల కృష్ణారెడ్డి రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారని సమాచారం. ఆ సమావేశంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం కాంగ్రెస్ పార్టీలోకి రాజగోపాల్‌రెడ్డి వస్తున్నాడని, ఆ తరువాత బీజేపీలోకి వెళ్ళాలని చలమల్లతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. ఇరువురి ఒప్పందం ప్రకారమే ఈ పార్టీకి రాజీనామా చేసి నేను, ఆ పార్టీకి రాజీనామా చేసి నీవు రావాలని ఒప్పందం కుదుర్చుకున్నారని తెలుస్తుంది. ఈ దెబ్బతో పాల్వాయి స్రవంతికి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేయటం కారణంగా రెండు పార్టీలలో మనమే ఉండవచ్చునని కుట్రలు పన్నినట్లు తెలుస్తుంది. బీజేపీ పార్టీ ఓట్లతో పాటు కొన్ని ఇతరా పార్టీల ఓట్లను చీల్చితే సునాయాసంగా గెలువవచ్చునని కోమటిరెడ్డి బ్రదర్స్ ఎత్తులు వేసినట్లు సమాచారం. అందుకే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మీడియా ముందు దూషించినట్లు నటిస్తే, ఎక్కువ శాతం ఓటు బ్యాంకును తన ఖాతాలో వేసుకోవడం వల్ల సాద్యమైనంత వరకు ఓట్లను చీల్చవచ్చునని, తద్వారా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి లాభం చేకూర్చవచ్చని, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గెలుపు కోసం ఎత్తులు వేస్తున్నారని సమాచారం. పార్టీలు మారాలనే ప్లాన్ ఇప్పటికిప్పుడు వచ్చిన ఆలోచన కాదని, గత కొంత కాలంగా రాజకీయ సమీకరణాలలో భాగంగా పరిస్థితులను బట్టి మారాలని, పక్కా ప్లాన్ ప్రకారం చీకటి ఒప్పందంలో భాగంగా పార్టీలు మారినట్లు సమాచారం. ఈ ఒప్పందం ప్రకారం రాజగోపాల్‌రెడ్డి నుంచి చలమల్లకు భారీ ఒప్పందం కుదిరినట్లు సమాచారం.

# తెలంగాణలో టిడిపి నిర్ణయంతో ఎవరికి లబ్ది?

## టిడిపి సానుభూతిపరుల నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ



గెలుపోటములను పలుచోట్ల ప్రభావితం చేసే సత్తా

**హైదరాబాద్, నవంబర్ 1 (సమ సమాజం):** తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పోటీ చేయకూడదని తీసుకున్న నిర్ణయంతో బిఆర్ఎస్ లాంటి పార్టీల్లో సానుకూలత వ్యక్తం అవుతోంది. టిడిపి పోటీ చేయకపోవడం తమరు లబ్ది చేకూర్చే అంశంగా ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. తెలంగాణలో ఉన్న ఆ పార్టీ అభిమానుల ఓట్లు గంపగుత్తగా తమకే పడతాయన్న దీమాలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ పోటీ చేయకపోతే.. ఆ పార్టీ సానుభూతిపరులు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారన్న చర్చ కొంత కాలంగా ఉంది. చంద్రబాబు అరెస్ట్ తర్వాత గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ప లు చోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. అయితే వీటిపై తెలంగాణ సర్కార్ ఉక్కుపాదం మోపింది. దీంతో .. టీడీపీ సానుభూతిపరులు అసంతృప్తికి గురయ్యారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్‌కు ఓటు వేయకూడదన్న ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు అరెస్ట్ పరిణామాల వెనకు బీజేపీ కూడా ఉందని నమ్ముతున్నారు కాబట్టి టీడీపీ సానుభూతిపరులు బీజేపీ కూడా ఓటు వేయరని కొంత మంది విశ్లేషిస్తున్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుండి టీడీపీకి మద్దతుగా ఉండే సానుభూతిపురులు బీఆర్ఎస్ కు మద్దతుగా నిలుస్తున్నారు. గ్రేటర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు గెల్చుకుంది సెటిలర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే. టీడీపీ కూడా ఆయా ప్రాంతాల్లో బలంగా ఉందని ఇప్పటివరకు అనుకుంటున్నారు. అయితే చంద్రబాబు అరెస్టు తర్వాత పరిణామాలు ఏపీలో సీఎం జగన్‌కు బీఆర్ఎస్‌కు మద్దతుగా ఉండటం వంటి అంశాలను చూస్తే... బీఆర్ఎస్‌కు ఈ సారి టీడీపీ సానుభూతిపరులు ఓట్లు వేయరని చెబుతున్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లినప్పటి నుండి తెలంగాణలో టీడీపీ కార్యక్రమాలు పూర్తిగా ఆగిపోయాయి. మధ్యలో బాలకృష్ణ నేనున్నానంటూ సమావేశం పెట్టారు. కానీ తెర వెనుక ఏం జరిగిందో కానీ.. ఆయన పూర్తిగా పట్టించుకోలేదు. చివరికి పోటీ చేయడం లేదని నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ పోటీ చేయకపోతే ఎవరికి లాభం కలుగుతుందన్న చర్చ ఇప్పుడు ప్రధానాంశంగా మారింది. బీఆర్ఎస్ కు పెద్ద భారం దిగిపోయినట్లవుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు మేలు జరుగుతుందని, టిడిపి వాదులంతా కాంగ్రెస్‌లో చేరడమే ఇందుకు ఉదాహరణ అని చెప్పకుంటున్నారు. అసలు ఇదంతా బీజేపీకి లాభం కలుగుతుందని అనుకునే వారూ ఉన్నారు. తెలంగాణలో టీడీపీ బలమైన శక్తి కాకున్నా ప్రభావితం చేసేంత శక్తిని కలిగి ఉంది. తెలంగాణ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఓ ఫోర్స్ కాదు. చంద్రబాబునాయుడు ఖమ్మంలో సభ పెట్టే వరకూ ఆ పార్టీకి క్యాడర్ ఉందని కూడా ఎవరూ అనుకోలేదు. ఖమ్మం .. ఆ తర్వాత సికింద్రాబాద్‌లో సభలు పెట్టి మళ్లీ పార్టీని యాక్టివ్ చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ ను అధ్యక్షుడ్ని చేసిన తర్వాత కొన్ని చేరికలూ జరిగాయి. పార్టీ బలోపేతం అవుతోందని..ఏదో ఓ పార్టీతో పొత్తు లేకపోతే.. బలమైన ఓ ఇరవై స్థానాల్లో పోటీ చేయాలని ప్లాన్లు రెడీ చేసుకున్నారు. కానీ మొత్తం తిరగబడిపోయింది. చంద్రబాబు అరెస్ట్ అయిన తర్వాత ఓ సారి కాసాని జ్ఞానేశ్వర్ ములాఖత్ అయినప్పుడు ఏ విషయం చెప్పలేదు. ఆ సమావేశం తర్వాత కాసాని 75 మంది అభ్యర్థుల జాబితాను రెడీ చేసుకున్నారు. అయితే చంద్రబాబు మాత్రం చివరికి పోటీ వద్దని తేల్చేశారు. దాంతో ఆయన టీ టీడీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. పార్టీ క్యాడర్, నేతలకు సమాధానం చెప్పుకోలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణలో టిడిపిక బలం లేదని ప్రచారం జరిగింది. కాసాని రాజీనామా నిర్ణయం కూడా పార్టీని కొంత కలవరపాటుకు గురి చేసింది. అలాగే కొందరు నేతలు కూడా పార్టీని వీడారు. రావుల చంద్రశేఖర్ రెడ్డి లాంటి వారు పార్టీని వీడి బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కారణాలతోనే టిడిపి ఎన్నికలకు దూరంగా ఉండాలని భావించి ఉంటుంది. ఇకపోతే చంద్రబాబు అరెస్ట్ అయిన నెల రోజులకు.. నారా లోకేష్.. అమిత్ షాను కలిశారు. ఆ సమయంలో అమిత్ తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు ఉన్నారు. తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కూడా ఉన్నారు. ఆ చర్చల్లో తెలంగాణ రాజకీయాల్లో టీడీపీ పాత్రపై చర్చకు వచ్చిందో లేదో తెలియదు. కానీ తర్వాత జనసేనతో పొత్తు కోసం.. పవన్ కల్యాణ్‌తో కిషన్ రెడ్డి చర్చలు జరిపారు. ప్రస్తుతం ఆ పొత్తులు కూడా తుదిదశకు చేరలేదు. జనసేనతో కలిసి పోటీ చేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని స్పష్టమయింది. కానీ టీడీపీని కలుపుకునే అంశంపై చర్చలు జరగలేదు. తెలుగుదేశం పార్టీ అంటూ పోటీ చేస్తే.. ఒకటి, రెండు స్థానాలు అయినా దక్కించుకుంటుందో లేదో చెప్పడం కష్టం. ఎందుకంటే ఆ పార్టీ చాలా వరకూ నిర్వీర్యం అయిపోయింది. బలమైన అభ్యర్థి దొరికితే.. గ్రేటర్ హైదరాబాద్, ఖమ్మం వంటి చోట్ల..ఒకటి , రెండు చోట్ల గెలుపొందే అవకాశం ఉండేది. కానీ కనీసం నలభై నియోజకవర్గాల్లో గెలుపోటముల్ని తారుమారు చేసే రీతిలో ఓట్లు పొందుతుందన్న అభిప్రాయం మాత్రం బలంగా ఉంది. ఇప్పుడు ఈ ఓట్లన్నీ ఎవరికి దక్కుతాయన్నది అంచనా వేయడం కష్టమే అయినా టిడిపి సానుభూతిపరులు తలచుకుంటే గెలుపోటములను తారుమారు చేయగలరని కూడా భావించాలి. కాబట్టే ఇప్పుడు టిడిపి సానుభూతిపరుల ఓట్లు ఎటువైపు అన్న చర్చ సాగుతోంది.

# తెలుగుతనానికి నిలవుటద్దం వైఎస్సార్



● వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానంలో జగన్ ● గవర్నర్‌తో కలసి వివిధ రంగాల ప్రముఖులకు అవార్డులు అందచేత
● అవార్డులు అందుకున్న ఉదయం జర్నలిస్టుల శివాజీ, చక్రధర్‌లు





**విజయవాడ, నవంబర్ 1 (సమ సమాజం):** తెలుగుతనానికి, తెలుగు మాటకు, తెలుగు వాడి గుండె ధైర్యానికి పల్లెలు, పేదలు, రైతుల మీద మమకారానికి, సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు రూపం వైఎస్సార్ అని ఏపీ సీఎం జగన్ అన్నారు. విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానంలో గవర్నర్ నజీబ్‌తో కలసి పాల్గొన్న జగన్... తన తండ్రి గొప్పదనాన్ని మరోసారి గుర్తు చేసుకున్నారు.గవర్నర్ నజీబ్, సీఎం జగన్ చేతుల మీదుగా ఏడు రంగాలకు 27 మంది అవార్డులు అందుకున్నారు. ఇందులో 23 మంది వైఎస్ఆర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారు. నలుగురు వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారు. అవార్డుల ప్రదానం సందర్భంగా మాట్లాడిన సీఎం జగన్... ఆంధ్రప్రదేశ్ అవతరించి నేటికి 67 సంవత్సరాలైంది. వరుసగా ఈరోజుకు లెక్కేసుకుంటే ఇది మూడో సంవత్సరం ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని మనం జరుపుకుంటున్నాం. మన రాష్ట్రాన్ని వివిధ రంగాల్లో దశాబ్ధాలుగా సుసంపన్నం చేసిన ప్రముఖులను గౌరవిస్తూ వైఎస్సార్ అవార్డులతో సత్కరించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టాం. మన సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తూ వివిధ రంగాల్లో ఆకాశమంత ఎదిగినా సామాన్యులుగానే ఒదిగి ఉన్న అసామాన్యులకు ఇస్తున్న అవార్డులు ఇవి. ఈ సంవత్సరం 27 మందికి వైఎస్సార్ అవార్డులతో సత్కరిస్తున్నాం. ఇందులో నలుగురికి అచీవ్‌మెంట్, 23 మందికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేస్తున్నాం అన్నారు. తెలుగుతనానికి, తెలుగు మాటకు, తెలుగు వాడి గుండె ధైర్యానికి మన పల్లెలు, మన పేదలు, మన రైతుల మీద మమకారానికి, మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు రూపం డాక్టర్ వైఎస్సార్ పేరిట ఏటా రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత అవార్డులు ప్రదానం చేస్తుంది. వైఎస్సార్ హయాంలో వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం ఇలా ఏ రంగాన్ని తీసుకన్నా చరిత్ర మారుస్తూ ఎన్నో ముందడుగులు పడ్డాయి. ఇలాంటి రంగాల్లోవిశిష్ట సేవలంది స్తున్న గొప్ప వ్యక్తులకు ఈ ఏడాది అవార్డుల్లో చోటు దక్కింది. ఈ అవార్డులు అందుకుంటున్న వారంతా తమ రంగాల్లో వారి జీవితాన్ని త్యాగం చేసినవాళ్లే. వారసత్వాన్ని తమ భుజాలపై మోసిన వారే. వీరంతా మన జాతి సంపద. సమాజం ఇచ్చిన గుర్తింపు ఆధారంగా ప్రదానం చేస్తున్న ఈ అత్యున్నత అవార్డుల్లో ఈ మూడేళ్లు కూడా సామాజిక న్యాయం సంపూర్ణంగా వర్ధిల్లింది అని అభిప్రాయపడ్డారు. వ్యవసాయంలో పంగి వినీత వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. అదే రంగంలో అనంతపురానికి చెందిన వైవి మల్లారెడ్డి పురస్కారం అందుకున్నారు. ఆర్ట్ అండ్ కల్చర్ రంగంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన రంగస్థల నడుటు యడ్ల గోపాలరావుకు, తప్పెటగుళ్లు కళాకారుడు కోన సన్యాసి, తిరుపతికి చెందిన కంలకారీ ఆర్టిస్టు తలిసెట్టి మోహన్, బాపట్లకు చెందిన హరికథా కళాకారుడు కోట సచ్చిదానంద శాస్త్రికి అవార్డు వరించింది. ఉప్పాడ హ్యాండ్ లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీకి పురస్కారం దక్కింది. ఇకపోతే ఉదయ దినపత్రిక జర్నలిస్టులు తల్లావజు&ఝల శివాజీ చిత్రలేఖనంలో, గోవిందరాజుల చక్రధర్ జర్నలిజంలో అవార్డులు అందుకున్నారు.

# తెలంగాణ కోసం పుట్టిందే బిఆర్ఎస్ పార్టీ



(మొదటి పేజీ తరువాయి) మూడు గంటలు ఇస్తే సరిపోతుందని పీసీసీ అధ్యక్షుల వారు అంటారు. ఇంకా బాధ కలిగించే విషయం ఏంటంటే.. మనుషులకు మాట మాట్లాడితే.. కొంచెం ఇజ్జత్.. షరం ఉండాలన్నారు. కర్నాటక నుంచి ఓ పెద్దమనిషి వచ్చిండు ఉప ముఖ్యమంత్రి. కేసీఆర్ నీకు కావాలంటే బస్సుపెడుతం నువ్వు వచ్చి చూడు.. కర్నాటకలో రైతులకు ఐదుగంటల కరెంటు ఇస్తున్నమని చెబుతున్నడు. సన్నాసి మేం 24గంటల కరెంటు ఇస్తున్నం.. ఐదుగంటల కాదు. నువ్వు ఇక్కడ చూడాలి.. కర్నాటక వచ్చి చూసేది ఏముందని చెబుతున్నం. కాంగ్రెస్ నేతలు కరెంటు మూడుగంటల ఇస్తే సరిపోతుందని మాట్లాడుతున్నరు. మరి సరిపోతుందా మూడుగంటలు ? 24గంటల కరెంటు ఉండాలంటే బీఆర్ఎస్‌కు ఓటువేయాలి' అని పిలుపునిచ్చారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఇప్పటి వరకు ఇస్తున్న పెన్షన్లు పెంచుకుందాం. ఆర్థికంగా పెరిగిన కొద్దీ పెన్షన్లు పెంచుకున్నాం. కల్యాణలక్ష్మిని కూడా పెంచుకుంటూ వచ్చాం. పెన్షన్లు రూ.5వేలకు తీసుకొని పోతాం. అర్హులైన మహిళలకు రూ.3వేలు వచ్చేలా విధంగా స్కీమ్ తయారవుతున్నది. గ్యాస్ సిలిండర్ తక్కువ ధరకే రూ.400 ఇచ్చే పథకాన్ని ప్రకటించాం. ఎవరమైనా సరే ఆపదలు రావొచ్చు. హఠాత్తుగా చనిపోవచ్చు. రైతుబీమా పెట్టాం. బ్రహ్మాండంగా పని చేస్తున్నది. ఇవాళ్టికి లక్ష కుటుంబాలకు అందింది. ఇవాళ చేతులెత్తి దండంపెడుతున్నరు. రైతుబీమా లేకుంటే.. మా కొంప బజారున పడేది.. మేం బతుకలేకపోదుము.. ఈ డబ్బుతో సురక్షితంగా ఉన్నాం.. కనీసం గౌరవంగా ఉన్నామని అంటున్నరు. మొన్న ఆలోచన చేస్తే మంత్రులు, సామంతులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరు సార్ ఇంత మంచి పని చేశారు. మనదగ్గర చాలామంది గిరిజన, దళిత, బీసీ, ముస్లిం మైనారిటీలకు చెందిన పేదలకే ఎక్కువ ఉన్నారు కాబట్టి సామన్య ప్రజానీకానికి రేషన్‌కార్డులందరికీ అందరికీ బీమా చేయాలని అడిగారు. దాన్ని కూడా వచ్చే మార్చి తర్వాత సాధారణ మరణం సంభవించినా.. రూ.5లక్షలు వస్తయ్' అని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ.. తెలంగాణ ప్రజల హక్కుల కోసమే పోరాడే పార్టీ అని ముఖ్యమంత్రి కేసీఆర్ తేల్చిచెప్పారు.మాకు ఢిల్లీలో బాసులు లేరు.. మాకు బాసులు ఎవరైనా ఉన్నారంటే అది మీరే తప్ప ఇంకెవరు లేరు అని కేసీఆర్ స్పష్టం చేశారు. మీరు ఏ ఆదేశం ఇస్తే, మీకు ఏది అవసరం ఉంటే దానికే తలవంచుతాం తప్ప మా బాసులు ఢిల్లీలో లేరు. ఇక్కడ వేరే ఏ పార్టీ గెలిచినా వారి కట్కలు ఢిల్లీలో ఉంటాయి. స్విచ్ అక్కడ వేస్తేనే ఇక్కడ బల్బులు వెలుగుతాయి. వీళ్ల చేతుల ఏం ఉండదు. అందుకోసం మంచి చెడు గుర్తించాలి. తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష. చదువుకున్న విద్యావంతురాలైన హరిప్రియా నాయక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. గిరిజన ప్రాంతం లో ఇంత పెద్ద సభలు జరగవు. ఇంత మంది వచ్చారంటేనే పెద్ద మెజార్టీతో గెలిచారని అర్థమవుతుంది. తప్పకుండా విజయం మనదే అనే విశ్వాసం కలుగుతుంది. మానవీయ కోణంలో ఆలోచించే మంచి విద్యావంతులరాలైన హరిప్రియను భారీ మెజార్టీతో గెలిపించాలి అని కేసీఆర్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలు, రైతుల గురించి ఆలోచించలేదు అని కేసీఆర్ తెలిపారు. అందుకే పార్టీల వైఖరి, దృక్పథం గురించి ఆలోచించాలి. వైద్య విధానం, విద్యా విధానం మన కండ్ల ముందుంది. ఇంతకు ముందు ప్రయివేటు దవాఖానాల్లో ఇష్టమొచ్చినట్లు ఆపరేషన్లు చేసి దోపిడీ జరిగేది. అమ్మ ఒడి వాహనాలు వస్తున్నాయి. కేసీఆర్ కిట్ అమలు చేసిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయని కేసీఆర్ తెలిపారు. తెలంగాణలో అన్ని వర్గాలకు రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టుకున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు. గురుకులాల్లో చదివిన పిల్లలు బ్రహ్మాండమైన ర్యాంకులు తెస్తున్నారు. ఆల్ ఇండియా లెవల్ నీట్ పరీక్షల్లో కూడా ఉత్తీర్ణులు అవుతున్నారు. ఎంబీబీఎస్ సీట్లు కొడుతున్నారు. ఇంజినీర్లు, డాక్టర్లు అవుతున్నారు. గతంలో ఈ గురుకులాలు ఎందుకు లేవు. గురుకులాలను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసుకున్నాం. సీతారామా ప్రాజెక్టుల త్వరలోనే పూర్తవుతుంది. మన దరిద్రం కూడా పోతది. ఎత్తులో ఉన్న మండలాలకు లిఫ్ట్ పెట్టి నీళ్లిస్తాం అని కేసీఆర్ తెలిపారు. గిరిజన సోదరులను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు అని సీఎం ధ్వజమెత్తారు. మా తండాల్లో మా రాజ్యం కావాలని పోరాడారు. గిరిజన తండాలను గ్రామపంచాయతీలు చేశాం. గిరిజనులకే అధికారం వచ్చింది. అభివృద్ధి చేసుకుంటున్నారు. ఇల్లందు నియోజకవర్గంలో మనిషి చనిపోతే జాగ లేక గుట్టల మీద కాలబెట్టే రోజులు ఉండే. ఇవాళ వైకుంఠధామాలు ఏర్పాటు చేశాం. ప్రజల కనీస అవసరాలు గుర్తించి చేసిన వారెవరో.. చేయని వారెవరో, ప్రజలను వారి ఖర్మకు వారిని వదిలేసిన వారు ఎవరో గుర్తించి ఓటు వేయాలి అని కేసీఆర్ సూచించారు.

# కెసిఆర్‌ను గద్దె దించాలంటే కలసికట్టు పోరాటం



(మొదటి పేజీ తరువాయి) ఆయన సొంత కుటుంబంలో చేరినట్లేనని, ఆయన్ను కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానిస్తున్నానని రేవంత్ అన్నారు. వివేక్ చేరిక కాంగ్రెస్‌కు వెయ్యేనుగుల బలాన్ని చేకూర్చిందన్నారు. కీలక సందర్భంలో ఆయన కాంగ్రెస్‌లో చేరడంతో తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, కాంగ్రెస్ రావాలనే ప్రజల ఆకాంక్షకు వివేక్ చేరిక బలాన్నిస్తుందని రేవంత్ వ్యాఖ్యానించారు. కాగా ఎన్నికల సమయంలో బీజేపీకి వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి ఆ పార్టీకి రాజీనామా చేశారు. బీజేపీకి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వివేక్‌తో ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే ఫోన్ చేసి మాట్లాడారు. 'తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన మీలాంటి వాళ్లు కాంగ్రెస్‌లోకి రావాలని కోరారు' ఖర్గే ఆహ్వానం మేరకు ఇవాళ నోవాటెల్‌లో రాహుల్ గాంధీని కలిసి పార్టీలో చేరారు.

# కెటిఆర్ కాన్వాయ్‌ను తనిఖీ చేసిన పోలీసులు



(మొదటి పేజీ తరువాయి) హైదరాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తున్నారు. ఈ క్రమంలో మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద మంత్రి వాహనాన్ని ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి పోలీసులకు మంత్రి కేటీఆర్ పూర్తిగా సహకరించారు. మంత్రి వాహనంతో పాటు ఆయన వెంట ఉన్న ఇతర వాహనాలను సైతం పోలీసులు చెక్ చేశారు. తనిఖీకి సహకరించిన మంత్రికి పోలీసులు ధన్యవాదాలు తెలిపారు. తనిఖీ అనంతరం కేటీఆర్ కామారెడ్డి బయలుదేరారు.

# బిఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం : మంత్రి హరీశ్‌రావు



(మొదటి పేజీ తరువాయి) తమతో కలిసి పని చేశాడన్నారు. సహచరుడినీ కాపాడుకోవాలి అని వచ్చామని తెలిపారు. కష్టకాలంలో పార్టీ కోసం పని రామ్మోహన్ గౌడ్ పనిచేశారన్నారు. ముక్కు సూటితత్వం ఉన్న మనిషి అని పేర్కొన్నారు. రెండు సార్లు టికెట్ ఇచ్చామని... స్వల్ప మెజార్టీతో ఓడిపోయారని హరీష్ రావు తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు తోడ్పాటును రామ్మోహన్ గౌడ్ అందించారన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి టికెట్ ఆశించి భంగపడ్డారని హరీష్ రావు తెలిపారు. రామ్మోహన్ గౌడ్ కు బీఆర్ఎస్ పార్టీ తగిన ప్రాధాన్యమిస్తుందన్నారు. ఆయన వెంట వచ్చే కార్యకర్తలకు సైతం తగిన అవకాశాలు ఉంటాయన్నారు.పార్టీ ప్రతినిధిగా తాను వచ్చానన్నారు. కాంగ్రెస్ గెలిచేది లేదని.. డబ్బాలో రాళ్ళు వేసి కొడుతున్నారన్నారు. అన్ని సర్వేలు బీ ఆర్ఎస్ గెలుపు ఖాయం అంటున్నాయన్నారు. హైకమాండ్ ఢిల్లీలో ఉండే పార్టీ కావాలా? గల్లీలో ప్రజల మధ్య ఉండే పార్టీ కావాలా అని ప్రజలు ఆలోచిస్తున్నారని హరీష్ రావు తెలిపారు.

# మరో పవర్‌ఫుల్ అణుబాంబు తయారు చేయనున్న అమెరికా

(మొదటి పేజీ తరువాయి) అణ్వాయుధాల సంఖ్యను వెయ్యికి పైగా పెంచుతామని చైనా ప్రకటించిన అనంతరం పెంటగాన్ ఈ ప్రకటన చేసింది. బీ61-13 పేరుతో ఈ గ్రావిటీ బాంబును రూపొందించనున్నట్లు ఆ దేశ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం 'పెంటగాన్' తెలిపింది. నేషనల్ న్యూక్లియర్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ దీన్ని తయారు చేయనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించిన ఆమోదం, కేటాయింపు అంశం చట్టసభ ముందు పెండింగులో ఉన్నట్లు సమాచారం. నిరంతరం మారుతున్న ప్రపంచంలో అమెరికా మరింత శక్తిమంతంగా, సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. తమ దేశాన్ని సవాలు చేయాలనుకునే వారిని ఈ అణుబాంబు నిలువరిస్తుందని పేర్కొంది. ఒకవైపు రష్యా దూకుడు, మరోవైపు 2030 నాటికి అణ్వాయుధాల సామర్థ్యాన్ని వెయ్యికిపైగా పెంచేందుకు చైనా సిద్ధమవుతోందనే వార్తల నేపథ్యంలో అమెరికా నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌లోని హిరోషిమాపై ప్రయోగించిన బాంబు సుమారు 15 కిలో టన్నుల శక్తిని విడుదల చేయగా.. నాగసాకిపై విడిచిన బాంబు సామర్థ్యం 25 కిలోటన్నులు. కానీ, ప్రస్తుతం అమెరికా తయారు చేయనున్న ఈ బీ61-13 అణుబాంబు మాత్రం 360 కిలోటన్నుల శక్తిని ఉత్పత్తి చేయనున్నట్లు అంచనా. అంటే హిరోషిమాపై ప్రయోగించిన దానికంటే 24 రెట్లు ఎక్కువ. బీ61-13 వంటి గ్రావిటీ బాంబులను యుద్ధవిమానాల నుంచి జారవిడుస్తారు. గురుత్వాకర్షణ శక్తి సాయంతో లక్ష్యంపై పడుతుంది.

# కెసిఆర్ మీద పోటీ అంటే పోచమ్మ గుడి ముందే పొట్టేలును కట్టేసినట్టే : మంత్రి కెటిఆర్



(మొదటి పేజీ తరువాయి) ప్రతిపక్షాలకు ఫ్యూజ్‌లు ఎగిరిపోయినయ్. అందుకే ఏదోదో మాట్లాడుతున్నరు. కేసీఆర్ ఏదో చెడగొడుతందుకు వస్తున్నడని దుష్ప్రచారం చేస్తున్నరు. వాస్తవానికి సీఎం కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసమే కేసీఆర్ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నడు. నవంబర్ 9 తారీఖు నాడు కేసీఆర్ నామినేషన్ వేస్తుండ్రు. ఆ రోజు ఇంటికి ఒక్కరు చొప్పున కేసీఆర్ సభకు తరలిరావాలి' అని పిలుపునిచ్చారు. 'కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు వస్తడంటరు. అట్లనే ఇప్పుడు కామారెడ్డికి కేసీఆర్ వస్తున్నరు. కామారెడ్డిలో షబ్బీర్ అలీ ఇప్పటికే గంపన్న చేతిలో ఓడిపోయిండు. ఇప్పుడు కేసీఆర్ పోటీకి వస్తుండంటే ఆయన పోటీకి భయపడుతుండు. బీజేపీ ఆయన కూడా కేసీఆర్ మీద పోటీ అంటే వెనుకముందు అయితున్నడు. ఎన్నికల్లో ఎవని ప్రలోభాలకు లొంగొద్దు. బీజేపోడు ఇచ్చే పిప్పర్ మెంట్లకు, బిస్కెట్లకు ఆశపడొద్దు. కేసీఆర్‌ను గెలిపించుకుని ధమ్ బిర్యానీ తినాలి. కాంగ్రెసోడు, బీజేపోడు ఓటు కోసం ఏమిచ్చినా తీసుకోండ్రి. బీజేపోళ్లు సలాకా ఇచ్చినా తీసుకోండ్రి, సిమెంటు ఇచ్చినా తీసుకోండ్రి. ఎందుకంటే అవన్నీ మనల్ని ముంచి ఎత్తుకెళ్లిన గుజరాత్ దొంగ పైసలు. ఎవరేమిచ్చినా తీసుకుని ఓటు మాత్రం కేసీఆర్‌కే గుద్దుండ్రి. మోసాన్ని మోసంతోటే జయించాలి. ముల్లుముల్లుతోటే తియ్యాలి' అని మంత్రి కేటీఆర్ హితవు పలికారు.

# బిజెపి అభ్యర్థుల మూడో జాబితాకు అధిష్ఠానం కసరత్తు



(మొదటి పేజీ తరువాయి) పాల్గొన్నారు. రేపు తెలంగాణ బీజేపీ అభ్యర్థుల మూడో జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. ఈరోజు సాయంత్రం బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంకానుంది. ఈ నేపథ్యంలో సీఈసీకి ముందు జేపీ నడ్డాతో కోర్ కమిటీ సభ్యులు మరోసారి భేటీ కానున్నారు. జనసేనకు ఇచ్చే స్థానాలు మినహా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరుగనుంది. అభ్యర్థుల ఎంపికపై కోర్ కమిటీ నివేదికను జేపీ నడ్డాకు కిషన్‌రెడ్డి అందించనున్నారు. రెండు రోజుల తరువాత జనసేనకు ఇచ్చే స్థానాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పొత్తులో భాగంగా జనసేనకు 8 లేదా 9 సీట్లు బీజేపీ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# తెలంగాణను అప్పులకుప్పగా మార్చిన కెసిఆర్



(మొదటి పేజీ తరువాయి) అనేక రకాల అవినీతి ఆరోపణలు ఉన్న వారికి, మాఫియా వ్యవస్థలను పెంచి పోషిస్తున్న వారికి కేసీఆర్ టికెట్స్ ఇచ్చారని విమర్శించారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా, నిజాయితీగా పనిచేస్తున్న గిరిజన బిడ్డలకు టికెట్లు ఇవ్వలేదన్నారు. బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం ఉందని, మిగతా స్థానాలకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో అధికార పార్టీపై పూర్తి వ్యతిరేకత ఉందని కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని నవంబర్ 3 నుంచి ఉధృతం చేస్తామని కిషన్ రెడ్డి అన్నారు. అధికారమే లక్ష్యంగా ఎన్నికలకు పూర్తిగా సమాయత్తం అవుతామన్నారు. అలాగే కర్ణాటకలో మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ గురించి అక్కడి రైతులు స్వయంగా తెలంగాణకు వచ్చి చెబుతున్నారని అన్నారు. ఐదు నెలల్లో కర్ణాటకలో 'తెలంగాణ ఎలక్షన్ టాక్స్' పేరుతో కాంగ్రెస్ వసూళ్లకు పాల్పడుతోందని ఆరోపించారు. కర్ణాటక ప్రజలు నేరుగా తెలంగాణకు వచ్చి అక్కడ జరుగుతున్న పాలన గురించి చెబుతున్నారని అన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ కుట్రలకు తెరతీస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. చెన్నై సహా వివిధ మార్గాల ద్వారా తెలంగాణకు పెద్ద ఎత్తున డబ్బులు తరలిస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో కర్ణాటకను ఎలా దోపిడీ చేస్తుందో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పుల రాష్ట్రంగా మారిపోయిందని విమర్శించారు. ఇలాంటి స్థితిలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే బీజేపీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో బీజేపీ అతిపెద్ద పార్టీ అని కిషన్ రెడ్డి అన్నారు. ఎవరైనా పార్టీ వీడి వెళ్తే వచ్చే నష్టం లేదని అభిప్రాయపడ్డారు. బీజేపీ దేశం కోసం పనిచేస్తుందని, కేడర్ ఆధారిత పార్టీ బీజేపీ అని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వ్యక్తిగత కారణాలతో ఎవరైనా వెళ్తే తాము ఏమీ చేయలేమని చెప్పారు. జనసేనతో సీట్ల సర్దుబాటుపై అధిష్టానంతో చర్చ జరుగుతోందన్నారు. మానిఫెస్టో మీద చర్చ జరుగుతోందని, మార్పులు, చేర్పులు జరుగుతున్నాయని చెప్పారు. ఆదిలాబాద్ వంటి వెనుకబడిన జిల్లాలో ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చానని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. ముగ్గురు ట్రైబల్ ఎమ్మెల్యేలకు కేసీఆర్ టికెట్లు ఇవ్వలేదన్నారు. కనీసం కలిసేందుకు ప్రయత్నించినా సరే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రధాని మోదీ పని తీరు చూశానని, అది నచ్చి బీజేపీలో చేరినట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కలిసి పనిచేసిన ఈటల రాజేందర్ సహా బీజేపీలో ఉన్న నేతలందరి సాయంతో బీజేపీ విజయానికి పనిచేస్తానని అన్నారు.సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం కేటాయించి కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలకు గౌరవం ఇస్తోందని అన్నారు. కేడర్ తనతోనే ఉందని, బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావును గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఆశిస్తున్నానని, ఇస్తారని భావిస్తున్నట్లు చెప్పారు.

# నామినేషను తిరస్కరించారు



(మొదటి పేజీ తరువాయి) సమర్పించబోయారు. అన్నీ రూపాయి, రెండు, 5 రూపాయల నాణెలిలు ఉన్నాయి. వాటిని చూసిన ఆర్వో చిల్లర తీసుకోడానికి నిరాకరించారు. రూ.వెయ్యి వరకు మాత్రమే నాణెలిల రూపంలో తీసుకోడానికి అనుమతి ఉందని అధికారులు స్పష్టం చేశారు. మంగళవారం ఎన్నికల నామినేషన్ల చివరిరోజు కావడంతో, పై కారణంగా గణెళిశ్‌దాస్ నామినేషను వేయలేకపోయారు. గత నాలుగేళ్లుగా డ్రైవర్ల యూనియన్ సభ్యులు ఇస్తున్న చిల్లర భద్రపరచినట్లు ఆయన చెప్పారు.

# నేడు మంథనిలో రాహుల్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి) జరగనుంది. ఆరు గ్యారంటీ పథకాలపై మహిళలకు రాహుల్ వివరించనున్నారు. సభ అనంతరం కుంగిన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌ను పరిశీలించనున్నట్లు సమాచారం. బ్యారేజ్ వద్ద 144 సెక్షన్ కొనసాగుతోంది. రాహుల్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించారు. నెల రోజుల వ్యవధిలో మంథనిలో పర్యటించడం రాహుల్‌కు ఇది రెండోసారి.

# బంగారానికి పెరిగిన డిమాండ్



(మొదటి పేజీ తరువాయి) ఎగసింది. పసిడ కొనుగోళ్లకు పవిత్రమైనదిగా భావించే ధన్‌తేరాస్ కొనుగోళ్లు భారీగా జరుగుతాయన్న విశ్వాసాన్ని పరిశ్రమ వ్యక్తం చేస్తోంది. ధరలు కొంత తగ్గడం, పండుగల డిమాండ్ దీనికి కారణం. చైనా తర్వాత పసిడి కొనుగోళ్లకు రెండో అతిపెద్ద దేశంగా ఉన్న భారత్ సెప్టెంబర్ త్రైమాసికం డిమాండ్‌పై ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) విడుదల చేసిన నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు.. వాణిజ్య వర్గాల అభిప్రాయం ప్రకారం, 10 గ్రాముల ధర రూ.60,000 వరకూ కొంత ఆమోదయోగ్య మైనదిగా వినియోగదారులు భావిస్తున్నారు. అంతకన్నా తక్కువ ధరలో పసిడి భారీ కొనుగోళ్లు జరగొచ్చని అంచనా. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆభరణాల డిమాండ్ 7 శాతం పెరిగి 146.2 టన్నుల నుంచి 155.7 టన్నులకు చేరింది. ఇదే కాలంలో కడ్డీలు, నాణెలిల డిమాండ్ 20 శాతం ఎగిసి 45.4 టన్నుల నుంచి 54.5 టన్నులకు ఎగసింది. కడ్డీలు, నాణెలిల విభాగంలో డిమాండ్ 2015 గరిష్ట స్థాయిని చూసింది. మూడవ త్రైమాసికంలో పసిడి దిగుమతులు గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 184.5 టన్నుల నుంచి 220 టన్నులకు ఎగసింది. 2023 మొదటి 9 నెలల్లో బంగారం డిమాండ్ 481.2 టన్నులు. సంవత్సరం మొత్తంలో డిమాండ్ 700?750 టన్నులు ఉంటుందని అంచనా. 2022 డిమాండ్ 774 టన్నులతో పోల్చితే తగ్గడం గమనార్హం. అయితే దిగుమతులు మాత్రం పెరుగుతాయని అంచనా. 2022లో యల్లో మెటల్ దిగుమతులు 650.7 టన్నులు కాగా, 2023 సెప్టెంబర్ వరకూ జరిగిన దిగుమతుల విలువ 563 టన్నులు. ఇదిలాఉండగా, అంతర్జాతీయంగా మూడవ త్రైమాసికంలో పసిడి డిమాండ్ 6 శాతం పడిపోయి 1,147.5 టన్నులకు చేరింది. సెంట్రల్ బ్యాంకుల నుంచి తగ్గిన కొనుగోళ్లు, కడ్డీలు, నాణెలిల డిమాండ్ తగ్గడం దీనికి కారణమని డబ్ల్యూజీసీ తన నివేదికలో పేర్కొంది. చైనా డిమాండ్ మూడవ త్రైమాసికంలో 242.7 టన్నుల నుంచి స్వల్పంగా 247 టన్నులకు ఎగసింది.

**Edited, Printed, Published & owned by** ***GOSUKONDA PRUDHVIRAJU***, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
**Printed at** ***Panidhar PUBLICATIONS.*** Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in